పునర్ముద్రిత లఘు గ్రంథాలు

తెలుగు వచన వికాసము

డా॥ యం.కులశేఖరరావు

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

పునర్ముద్రిత లఘు గ్రంథాలు

తెలుగు వచన వికాసము

డా॥ యం. కులశేఖర రావు

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

మండలి వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగుకేంద్రం

పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు - 500 001.

Telugu Vachana Vikaasamu
– Dr. M.Kulasekhara Rao

తెలుగు వచన వికాసము

రచయిత : డా॥ యం. కులశేఖర రావు

ISBN : 81-86073-332-5

© **పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**

ప్రచురణ నెం : **469**

ప్రతులు : **5000**

ప్రథమ ముద్రణ : **ఏప్రిల్, 1975**

ద్వితీయ ముద్రణ : **డిసెంబర్, 2012**

వెల : **రూ. 20/-**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
లలితకళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాదు – 500 004.

ముద్రణ : **సాయిలిఖిత ప్రింటర్స్**, ఖైరతాబాద్, హైదరాబాద్.

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్

నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

కిరణ్ రెడ్డి

(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)

ముఖ్యమంత్రి

V. VASANT KUMAR, B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899

ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష. సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే “ప్రపంచ తెలుగు మహాసభల” నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

(వట్టి వసంతకుమార్)

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వవిద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వవిద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో 1975 నాటి మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముద్రించిన డా॥ యం. కులశేఖర రావు గారి "తెలుగు వచన వికాసము" అనే గ్రంథాన్ని పునర్ముద్రిస్తున్నాం. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న ఆచార్య సి.మృణాళిని గారికి, ఆచార్య డి. మునిరత్నం నాయకుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

Blank Page

ముందుమాట

ఎన్నో ఏళ్లుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వ సమయం ఆసన్నమవుతున్నది. ప్రపంచంలోని తెలుగువారి ప్రతినిధుల నందరినీ ఒకచోట సమీకరించవలెనని పెద్దలందరూ కన్నకలలు ఫలిస్తున్న శుభసమయమిది. రాబోయే ఉగాది రెండువేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టముకాగలదు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల కాలంనుంచి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారత దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదు కోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడే వారి తరువాతి స్థానం తెలుగువారిదే. బౌద్ధపూర్వయుగం నుంచి ఇటీవల బ్రిటీష్ సామ్రాజ్య పరిపాలనా యుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్లడం జరిగింది. అట్లా వెళ్లిన తెలుగువారు తమ భాషా సంస్కృతీ సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తూ ఉన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదిక మీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషిని గూర్చి చర్చించి, నిర్ణయించు కోవడానికి, తద్వారా వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖం చేసి మన సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహదకారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు ఆర్ద్రమైన భావసమైక్యతకు ప్రాతిపదికలై తెలుగు జాతిని సమైక్యం చేయగలవని, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవని విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన తెలుగు ఉగాది రోజున ప్రారంభమై ఒక వారంరోజుల పాటు జరిగే ఈ మహాసభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాల

నుంచీ, యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థల నుంచీ విచ్చేసిన ప్రముఖులు ప్రతినిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల, కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాల నుంచి ప్రస్ఫుటం చేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రహాలయాన్ని (మ్యూజియంను) స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజభూతమవుతుంది. తెలుగువారి సంస్కృతిని నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదంచేసే గ్రంథాలు అనేకం. ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి. ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయితలందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకు వచ్చిన అకాడమీల అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగు వారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయులందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రం చేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమేకాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

జలగం వెంగళరావు
అధ్యక్షులు,
ప్రపంచ తెలుగు మహాసభలు.

పరిచయము

సహస్రాబ్దాలుగా ప్రవర్ధమానమగుచున్న తెలుగు సంస్కృతిని తెలుగు దేశపు నలుచెరగుల పరిచితముచేయు సంకల్పముతో 1975వ సంవత్సరమును తెలుగు సాంస్కృతిక సంవత్సరముగ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రకటించినది. అందుకు అనుగుణమైన కార్యక్రమాలను నిర్వహింపజేయుటయేగాక, ప్రపంచములోని వివిధ దేశాలలో నివసించుచున్న తెలుగువారి సాంస్కృతిక ప్రతినిధులందరును ఒకచోట సమావేశమగు వసతిని కల్పించుటకై 1975, ఏప్రిల్ 12 (తెలుగు ఉగాది) మొదలుగ ప్రపంచ తెలుగు మహాసభ హైదరాబాదున జరుగునటుల ప్రభుత్వము నిర్ణయించినది. అందుకు ఒక ఆహ్వాన సంఘము ఏర్పాటయినది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ జలగం వెంగళరావుగారు ఆ సంఘమునకు అధ్యక్షులు, విద్యాశాఖామంత్రి మాన్యశ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు దాని కార్యనిర్వాహకాధ్యక్షులు, ఆర్థిక మంత్రి మాన్యశ్రీ పిడతల రంగారెడ్డిగారు ఆర్థిక, సంస్థా కార్యక్రమాల సమన్వయ సంఘాల అధ్యక్షులు.

ఆ సంఘము, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున వచ్చువారికి తెలుగుజాతి సాంస్కృతిక వైభవమును తెలియజేయుటకు అనువుగ ఆంధ్రభాషా, సాహిత్య, కళా చరిత్రాదికములను గురించి ఉత్తమములు, ప్రామాణికమునగు కొన్ని లఘు గ్రంథములను ప్రకటించవలెనని సంకల్పించి, ఆ కార్యనిర్వహణకై 44 మంది సభ్యులుకల ఒక విద్వత్ సంఘమును, శ్రీ నూకల నరోత్తమరెడ్డి గారి అధ్యక్షతన నియమించినది. ఆ విద్వత్ సంఘము ఆ లఘు గ్రంథముల వస్తువుల నిర్దేశించి వాని రచనకై ఆయారంగములందు పేరుగనిన ప్రముఖులను రచయితలుగ యెన్ను కొనినది. ఈ విధముగ సిద్ధమైన గ్రంథములలో భాషా, సాహిత్య, చారిత్రక

విషయములకు సంబంధించిన వానిని ప్రకటించు బాధ్యతను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వహింప వలసినదిగ ప్రపంచ తెలుగు మహాసభాకార్యనిర్వాహకాధ్యక్షులు మాన్యశ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు అకాడమీని కోరగా, మహాసభా సఫలతకొరకై కృషి చేయు సంకల్పముతో ఈ బాధ్యతను వహించుటకు అకాడమీ సంతోషముతో అంగీకరించింది.

ఆ విధముగ ప్రకటింపబడిన గ్రంథశ్రేణిలో ఈ **తెలుగు వచన వికాసము** అను గ్రంథమును రచించిన డాక్టర్ యం.కులశేఖరరావుగారు ఆంధ్రపాఠక లోకమునకు సుపరిచితులు. వారికి మేము కృతజ్ఞతాబద్ధులము. గ్రంథమును నిర్దుష్టముగ, చక్కగ ముద్రించిన ప్రోగ్రెసివ్ ప్రెస్ వారికి మా కృతజ్ఞతలు.

హైదరాబాద్,
30-3-1975

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

విషయములు

		పుట
1.	ఆంధ్ర వచనము	1
2.	ఉత్పత్తి – వికాసము	3
3.	శాసనాలు	3
4.	ఆంధ్ర మహాభారతం వచన రచనము	11
5.	పోతన – శ్రీనాథుడు	16
6.	ప్రబంధాలు	18
7.	వచనైక రచనలు – స్తుతి వచనము	20
8.	చారిత్రక – కావ్యాలు	22
9.	దాక్షిణాత్యయుగం	25
10.	పౌరాణిక కావ్యాలు	26
11.	చిన్నయసూరి	30
12.	కందుకూరి వీరేశలింగం	31
13.	ఆధునిక యుగం	33

★ ★ ★

Blank Page

తెలుగు వచన వికాసము

ఆంధ్ర వచనము

ప్రపంచంలోని ఏ భాషలోనైనా, సాహిత్యము, గద్యము పద్యము, అనే రెండు శాఖల్లో విస్తరించి ఉంటుంది. సామాన్యంగా గద్యంకంటె ముందే పద్యం లిఖితం కావడం, ప్రచారాన్ని చెందడం సంభవిస్తుంది. ఛందస్సు, లయ మున్నగుణాలీ సౌకర్యాన్ని పద్యానికి సమకూర్చినాయని చెప్పవలె. గద్యము ఛందో రహితం కావడం చేతను, ఆకర్షణ లేనిది కావడం చేతను పద్యంతో పోల్చి చూచినప్పుడు కొద్ది తక్కువ ప్రచారాన్ని కలిగి ఉంటుందనేది యథార్థం. అయినప్పటికీ, పద్యం కంటే గద్యము అల్పశక్తి కలిగింది మాత్రం కాదు.

ఛందో రహితమైన వాక్య రచనకు సంస్కృతంలో గద్యమనియే వ్యవహారము. కాని, తెలుగులో వచనము, గద్యము అని సమానార్థకాలుగా ఉపయోగిస్తున్నాము. గద్యము అనే దానికి పర్యాయ పదంగా వచనము అనే తెలుగులోని ఉపయోగం, మన సోదర భాష అయిన కన్నడం నుంచి వచ్చింది. బసవేశ్వరుడనే శైవమతాచార్యుడు ఆ భాషలో 'షడ్స్థల వచనములు', 'కాలజ్ఞాన వచనములు' అనే ఛందో రహిత వచనాలను రచించినాడు. ఈతని అనుయాయులైన అక్క మహాదేవి, దేవర దాసమయ్య అనేవారు కూడ 'వచనములు' అనే రచనలు చేసి ఉన్నారు. ఈ రచనలకు ఆ భాషలో బహుళ ప్రచారం లభించింది. దీని ప్రభావం చేత, తెలుగులోని గద్యరచనలకు వచనము అనే పేరు వచ్చింది. ఆంధ్ర మహాభారత రచయితల్లో అగ్రగణ్యుడు అయిన తిక్కన సోమయాజి తన విరాట పర్వపీఠికలో ఇట్లు ప్రస్తావించినాడు.

"కావున భారతామృతము కర్ణపుటంబుల నార గ్రోలి యాం
ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్కృతి
శ్రీవిభవాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్".

ఈ కవియే నిర్వచనోత్తర రామాయణ పీఠికలో ఒక పద్యం ఈ విధంగా వ్రాసినాడు.

"వచనము లేకయు వర్ణన రచియింపఁగఁ గొంతవచ్చుం బ్రౌఢులకుఁ గథా
ప్రచయము బద్యములన పొందు చితంబుగఁ జెప్పుటార్యు లొప్పిదమనరే"

ఇది చూడగా, తిక్కన సోమయాజి కాలమునాటికి గద్యము, వచనము అనే పదాలు సమానార్థకాలుగానే ఉపయోగింపబడుతూ ఉండేవని నిర్వివాదంగా చెప్పవచ్చు. క్రీ.శ. 16వ శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత ఆంధ్ర లక్షణకారుడు అనంతామాత్యుడు తాను రచించిన ఛందోదర్పణంలో, ఈ విధంగా వ్రాసినాడు.

"కనుగొనఁ బాదరహితమై-పనుపడి హరిగద్దెవోలె బహుముఖ రచనం
బున మెరయు గద్యమదిదాఁ-దెనుఁగు కృతుల వచనమనఁగ దీపించుకడున్"

సంక్షిప్తంగా నిర్వచించినా, అనంతామాత్యుని అభిప్రాయం అనేక విశేషాలను తెలుపుతూ ఉన్నది. ఇతడు గద్యమంటే ఏమిటో చెప్తుతూ ఉన్నాడు. గద్యము 'పాదరహితం'గా ఉండవలెనట. ఇది సంస్కృతంలో విద్యానాథుడు చెప్పిన 'అపాదః పదసంఘాతో గద్యమ్' అనే దానికి సరిపోయింది. అనగా, ఛందోరహితమైన వాక్యరచనను గద్య మనడంతో అనంతామాత్యుడేకీభవించినాడు. ఇక 'హరిగద్దెవోలె బహుముఖ రచనంబున' గద్యము మెరయ వలె. హరిగద్దె అంటే ఆదిశేషుడు. అతనికి సహస్ర ముఖాలున్నాయి. గద్య రచన నిశ్ఛందమైంది కాబట్టి బహు విధాలుగా నడువవలె. అంటే, నియమిత పరిమితి గద్య రచనకు ఉండకూడదు. బహుముఖ రచన అనడంలో వేరొక అర్థం కూడా స్ఫురిస్తుంది. గద్యము పలువిధాలైన శైలితో, వైవిధ్యం కలిగి ఉండవలె. వృత్తగంధాది రచనారీతులిందుండ వలె. ఆదిశేషునికి పాదాలు లేనట్లే గద్యానికి నియమిత పాదాలు (నియమిత గణాలు) లేవు. ఇటువంటిదే

గద్యమని అనంతుని అభిప్రాయము. ఈ గద్య లక్షణము సంస్కృతానికి కూడ సరిపోతుంది. ఇట్టి రచన తెలుగులో చేస్తే. దాన్ని వచన మనవచ్చునని యితడు చెప్పినాడు. దీనివల్ల క్రీ.శ. 15వ శతాబ్దం నాటికి ఛందోరహితమైన వాక్యరచనకు వచనమని తెలుగులో వాడుక ఉండేదని స్పష్టమవుతుంది. ఇదే విషయాన్ని అప్పకవి యీ విధంగా వ్రాసినాడు :

"ధరసాహిత్యము గద్య పద్యములనం దారెండు భేదంబులై
పరగున్, గద్యమునందు బాదనియతుల్ భావింపఁగా లేవు, నా
కన్నురణంబై విలసిల్లగా నుడవ నొప్పున్ గావ్యమింతేనియున్
మరుతంండ్రీ, మఱిదీనికే వచన నామంబయ్యె నాంధ్రంబునన్"

ఒక విధంగా అప్పకవి అనంతామాత్యునితో ఏకీభవిస్తున్నట్లుగా ఈ పద్య మూలంగా తెలియ వస్తున్నది. కందుకూరి వీరేశలింగంగారు చెప్పిన ఈ కింది వాక్యాలను ఉద్ధరించి, యిక ఈ అంశాన్ని ముగించవచ్చు.

"రమారమి నలువది సంవత్సరముల క్రిందట తెలుగులో గద్య కావ్యములు లేవు. అప్పుడు చిన్నయసూరి వ్యాకరణమును రచించి యందులకు లక్ష్యముగా నీతిచంద్రికను వచనమున వ్రాసెను" దీనివలన వీరేశలింగంగారు గద్య వచన పద్యాలను సమానార్థకాలుగా ఉపయోగించినారనేది స్పష్టమే కదా.

ఉత్పత్తి - వికాసము

ఆంధ్ర వచనము ప్రధానంగా మూడు శాఖల్లో వికాసాన్ని పొందింది. 1. ప్రాజ్నన్నయ యుగం నుంచి. నాయకరాజుల యుగం వరకు. ఆయా వంశాల రాజులు ప్రకటించిన శిలాతామ్ర శాసనాలు. 2. చంపూ కావ్యాలు, 3. వచనైక రచనలు. ఈ మూడు విభాగాల్లో - విస్తరిల్లిన వచనాన్ని గురించి ఇపుడు చెప్పవలసి ఉన్నది.

శాసనాలు

ప్రాజ్నన్నయ యుగానికి చెందిన రాజవంశాల్లో రేనాటి చోళులు ముఖ్యమైనవారు. వీరు తెలుగులో శాసనాలు ప్రకటించి ఉన్నారు. వీటిలో తెలుగు

వచన రచన కనిపిస్తున్నది. మనకు లభించిన తెలుగు శాసనాల్లో గద్య శాసనాలే మొదటివి. రేనాటి చోళుల శాసనాలకు ఉదాహరణగా దీన్ని చెప్పవచ్చు.

"చోళ మహారాజుల్లో ఏళ ఎరిగల్ తుకరాజుల్లో యిచ్చిన పన్నాస రాచమానంబున ఏబది తిరువుళ పాఱకు ఇచ్చిన పన్నాస. దీనికి వక్రంబు వచ్చినవారు పంచ మహాపాతక అగు" (చోళ మహారాజు ఉరుటూరు శాసనము క్రీ.శ. 7వ శతాబ్ది).

ఇది తెలుగు వచనమున ఉత్పత్తిదశ అని చెప్పవచ్చు. రచన ప్రాథమికంగా ఉన్నప్పటికి, ఒక ప్రయోజనవంతమైన అర్థం దీనిలో స్ఫురిస్తున్నది.

రేనాటి చోళుల తరువాత, ఈ శాసనాల్లో చాళుక్య రాజుల శాసనాల్లోను ఆంధ్ర వచనం, చక్కని స్థానాన్ని సంపాదించింది. ఈ శాసనాల్లో చాళుక్యభీముని కొరవి శాసనాన్ని ప్రధానంగా పేర్కొనవలె. ఇది క్రీ.శ. 9వ శతాబ్దానికి చెందింది. దీనిలో వాక్యరచన ఈ విధంగా ఉంటుంది.

"శ్రీ విక్రమాదిత్య నృపాగ్రతన యుస్డయ్ని చాళుక్య భీమునకు. శౌచకన్దపున్నకు వేగీశ్వరునకు, రనమద్దాన్వయ కుల తిలకుణ్డయ్ని కుసుమాయి ధుణ్ణుగన్న... ... ... రాజ్యంబు సేయుచు నిష్టవిషయ కామోప భోగంబుల ననుభవించుచు సుఖంబుణ్డ యొకనాణ్డు కొరవి నల్లజెరియ కొడుకు పెద్దన రావించి, నీవు నా ప్రాణ సమానుణ్డవైన చెలివి... ... ..."

ఈ వాక్య విన్యాస వైఖరి పరిశీలించగా, ఇది క్రీ.శ. 11వ శతాబ్దమున వెలువడిన ఆంధ్ర మహా భారతంలోని వచనానికి సమీపంగా కన్పిస్తుంది. అయినా, ఇట్టి వాక్య రచనా క్రమంగాని, భావపరిపూర్ణతగాని, చోళ చాళుక్య శాసనాల్లో సార్వత్రికం కాదు. ఈ యుగ శాసనాల్లోని వచనాన్ని గురించి. స్థూలంగా ఈ విశేషాలు చెప్పవచ్చు.

1. పదాల్లో ప్రాకృత భాషా ప్రభావం ప్రస్ఫుటంగా ఉండడం.
2. వాక్య నిర్మాణ క్రమం పరిపూర్ణంగా లేక పోవడం.
3. అనేక సందర్భాల్లో సమాపక క్రియలు లేక పోవడం.

4. ఈనాడు ప్రచారంలో లేని అనేక పదాలు ఆ శాసనాల్లో కనిపించడం.

6. శకటరేఫము, ఙ, లు. అనే అక్షరాలు ఉపయోగింపబడటం.

మొత్తం మీద ఈ శాసనాల్లోని వచన రచన ఆంధ్ర మహాభారతంలోని వచన రచనకు పూర్వరంగంగా ఉండింది అనడం సమంజసంగా ఉంటుంది.

చోళ చాళుక్య యుగానంతరం ఆంధ్ర దేశంలో వెలువడినవి కాకతీయుల శాసనాలు రాజవంశంవారు వేయించినవి, సామంత మంత్రి దండనాథులు వేయించినవి, వీటిలో ఉన్నవి. రేచెర్ల వంశంవారు వేయించినవి కూడ ఈ యుగంలోని శాసనాల్లోనే చేర్చవలసి ఉన్నది. ఈ శాసనాలు వెలువడే నాటికి, ఆంధ్ర భాషలో విశేషమైన పరిణామం కలిగింది. ప్రథమాంధ్ర మహాకావ్యమైన మహా భారతం అప్పటికే తెలుగులో వెలువడింది. నన్నెచోడుడు మొదలైన వారు రచించిన కావ్యాలు కూడ అప్పటికే ప్రచారాన్ని పొందినాయి. ఇట్లు సాహిత్యకంగా, ఆంధ్ర భాషకు ఒక పరిణత దశ ఏర్పడింది. ఇంతకు పూర్వం ద్రవరూపంలో ఉన్న ఆంధ్రభాష, గ్రంథస్థమైన సాహిత్యాన్ని సంతరించుకొని ఘన రూపాన్ని పొంది ప్రామాణ్యాన్ని అందుకొన్నది. ఆ విశేష వాతావరణమును రూపొందించుకొన్న తెలుగుభాష కాకతీయ యుగ శాసనాల్లో నిబద్ధమైంది. అందుచేత ఈ శాసనాల్లోని తెలుగు వాక్య రచనా పద్ధతికాని, వచన రచనా విశేషాలు కాని ప్రాథమికంగా కాన్పించవు. ఇదివరకు తెలుగు పదాల్లో ఉండే ప్రాకృతభాషా ప్రభావం. ఇప్పుడు పరిపూర్ణంగా అదృశ్యమైనదనే చెప్పవలసి ఉంటుంది. ఆంధ్ర మహాభారతం గద్య పద్య మయమైన చంపూ కావ్యంగా వెలువడి ఉండడంచేత కాబోలు, ఈనాటి శాసనాల్లో అధికాంశం అదే పద్ధతిలో రచితమైనాయి. ఈ పద్ధతికి ఉప్పరపల్లి ఈ శాసనాన్ని ఉదహరించవచ్చు.

“స్వస్తి శ్రీమదపార పారావార పరివృత మహీతలంబున సకల వినుతంబగు నాంధ్ర దేశంబునకు విభూషణంబైన యనుమకొండ యను పురవరంబు నిజ రాజధానిగా నొప్పుచున్న కాకతి భూపాలక్రమంబున జనవినుత యశో విశాలుండునైన రుద్ర పుత్రుడును, పదారాధిత త్రినేత్రుండును విబుధ జనవసంతుండును, రమణీయ సీమంతినీ వసంతుడును, సకలజన మనోరంజకుండును, నరాతి రాజమద

భంజనుండును, శరణాగత రాజ శరణ్యుండును, విమతాఖిల రాజ వరేణ్యుండును, ధైర్యామరసానుమంతుండును, దురగరే వంతుడును, సత్య హరిశ్చంద్రుండును, విభవామరేంద్రుండును, నైన గణపతి దేవ మహీనాథునకుం బ్రధానియై.

కనకాచలధీరుడు జన - వినుత చరిత్రుండు గార్యవిదుం
డినతేజుడు గుణనిధి బెజ్జమ - తనయుండు బుధధీన భానుతనయుండనగాన్

ద్రి॥ **ప్రతిపక్ష క్షితిపాల కుంజర మద ప్రారంభ సంరంభ మ**
ద్ధతబాహా నిహిత ప్రచండ నిశితోద్యద్ఖడ్గధారానఖా
హతి భేదించి యఖర్వ గర్వబల శౌర్య స్ఫూర్తి గంబీరవాన్న
కృతియై నన్నుత వృత్తిదాల్చి తెలిసెన్ రేచెర్ల రుద్రుండిలన్

సకల వినుత యశుండును, గుణగణాలంకారుండును, నై న కా ట్రెడ్డికి సౌందర్య సౌభాగ్య చాతుర్యంబులు గలిగి పరగిన పరమ పతివ్రతమైన బెజ్జమాంబకుం బ్రియనందనుండును, ననవరత ధర్మ సమేతుండును, ప్రతిహిత చరణుండును, గాకతె రాజ్య భార ధౌరేయుండును, సద్గుణ ప్రఖ్యాతుండును, నతుల బలపరాక్రమ సమన్వితుండును, నైనరేచెర్ల రుద్రనకుం బ్రధాని

క. "కులతిలకుండు వసుధామర జలధి సుధాకరుండ శేషజన నుతచరితుం
దలఘుండు రిపుతరు దావానలుం డనగాబరగె రాజనాయకు దుర్విన్"

(Hyderabad Archeological Series No.3)

ఇదే చంపూ పద్ధతిలో ఈ శాసనమంతా రచితమైంది. ఇటువంటి వాక్యరచన, వచన రచన కలిగిన శాసనాలు అనేకంగా ఈ యుగంలో వెలువడినాయి. కాకతీయ యుగ శాసనాల్లోని వచన రచనమును గురించి, ప్రధానంగా ఈ అంశాలను పేర్కొనవలె.

1. ప్రాకృత భాషా రాహిత్యం.
2. భావం విశదంగా ఉండి, అస్పష్టత ఎచటనూ కాన్పించక పోవడం.
3. పరిపూర్ణ వాక్య విన్యాసక్రమం.

4. వైవిధ్యం కలిగిన వచన రచనాపద్ధతి – ఇది ఆంధ్ర మహాభారత ప్రభావంచేత ఏర్పడిన విశేషము.
5. మాండలిక పదప్రయోగాలు (బుసి భండాలు, మసిభండాలుమొ॥).
6. అచ్చుటచ్చుట వ్యావహారిక వాక్య రచనము. ('వానికి అనేక బ్రహ్మ కల్పాలు నరకములు. జగిరానకూ, దీపానకూ మూడు మర్తురు' వంటివి).

కాకతీయుల తరువాత ఆంధ్రదేశాన్ని కొండవీడు, అద్దంకి, రాజ మహేంద్రవరం అనే నగరాలను రాజధానులుగా జేసికొని రెడ్డిరాజులు పరిపాలించినారు. ఈ రాజులు ఆయా సందర్భాలను పురస్కరించుకొని శాసనాలను ప్రకటింపచేసిరి. ఈ శాసనాలకు తెలుగు వచనంతో సంబంధం ఉన్నది. కాబట్టి ఈ సందర్భంలో వాటిని ప్రస్తావించవలసి ఉంటుంది. ఈ శాసనాలు క్రీ.శ. 14, 15 శతాబ్దుల్లో వెలువడినాయి. ఈ శాసనాల్లోని వచనాన్ని ప్రదర్శించడానికి ఆ కాలపు శాసనాలకు ప్రతినిధి ప్రాయంగా ఉన్న ఈ చీమకుర్తి శాసనాన్ని ఉదహరించడం సముచితంగా ఉంటుంది.

"శ్రీ త్రిపురాంతకేశ్వర ॥ స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన వర్షంబులు 1258 అగు నేటి యువనామ సంవత్సర కార్తీక శు॥ 12 గురువాసరమన్వాది మహా పుణ్యకాలమునందు, యజుశ్శాఖాధ్యాయీ, అపస్తంభ సూత్ర కౌండిన్య గోత్రోద్భవులున్నూ, శ్రీ మద్యజనాది షట్కర్మ నిరతులగు కామేశ్వర భట్టారకుని వారి పౌత్రులున్నూ, కొన్డు భట్టారకుని పుత్రులన్నూ, చిట్టనమంచి తిమ్మన శాస్త్రులవారికి స్వస్తిశ్రీ సకల గుణాలంకార చంచుమల చూరకార విశ్వవిశ్వంభరా ధరణ వహన దక్ష దక్షిణాభుజదండ జగనొబ్బ గండ అనియు, మండలీకరగండ రాయచేకోలు గండరాయ మీసరగండ అర్థిప్రత్యర్థి హేమాద్రిదాననిరత ప్రజాపరిపాలన చతుర హరణ భరణ రూప నారాయణ, వీరనారాయణ భుజబల భీమ, కోదండరామ, అపరిమిత భూదాన పరశురామ అనేక నగరోపకంఠ ప్రతిష్ఠాపిత బహువిధారామ సంగడి రక్షపాలక జగరక్ష పాలక, జగద గోపాలక, గుజ్జరిభట్ట విభాళ ఘనభుజవి రాజమార కరవాల రాచూరి దుర్గ విభాళ, జలదుర్గ జలధి బడబానల స్థలదుర్గహవన హలాయుధ అనవరత పురోహిత సోమపాన, శ్రీపర్వత అహోబల నిర్మిత సోపాన,

దిఃక్కాంతా మనోహర కీర్తికుసుమామోద కుండిప్రభా సహ్యాజా గౌతమా జలక్రీడావినోద కలింగరాయ మానమద మర్దన మన్నియరాయ మృగవేంటకార, వొడ్డియరాయ నిర్ధూమధామ జంతుర్నాటరాయ హల్లకల్లోల అది రాయ బసవశంకర, విరోధి నృపదానవ నరసింహ పాండ్యరాయ గజసింహ, ప్రజ్ఞాచతుర్విధోపాయ, కేళాదిరాయ, నిత్యపరిపాలిత సత్యపల్ల వాదిత్యరిపునరపతి గోధూమ ఘట్టన ఘరట్ట అప్పయగోపయ దిశాపట్టణ, సంగ్రామ సముద్ధండ చండభూజాని విఖండిత కృతకీలాల ప్లవమాన, బ్రహ్మకుండి, కృష్ణ వేణీ గోదావరీ మహానదీ తతీద్వయన్మధ్య దేశానేకాగ్రహార అరణ్య పుణ్యక్షేత్ర సత్ర బహువిధ విహార, పూర్వసముద్రాధీశ్వర ఏకరాయ స్థాపనాచార్య ఏకసింహాసనాలంకార శ్రీమత్ త్రిపురాంతక దేవదివ్య శ్రీపాద పద్మారాధకులైన శ్రీమతు వేమయరెడ్డిగారు వ్రాయించి యిచ్చిన భూదాన ధర్మశాసనం॥ మద్భుజాదండ పరిపాలనమైన సామ్రాజ్యమందు శ్రీశైల భూమిని అంమ్మన బ్రోలి శీమలో రామతీర్థం సర్వాగ్రహారమున్నూ చీమకుర్తి భీమేశ్వర పులి కొండ మైలవరం కొమారపురి గ్రామములు అయిదింటియందున్నూ' వెలిపొలంలోనున్న, చర్వుల క్రింది మాంగానిలోనున్న, ఆకుతోంటలు చెఱకు తోంటలోను, భూమిచతుర్థాంశం సర్వమాన్యంగా నున్ను, మిగిలిన ముప్పాతిక భూమిని పండిన నానాఫలాదులనున్ను, షోడశాంశం మేరకు సువర్ణాదాయనకు పంచమాంశమున్నూ పెద్దచెరువు నీళ్లను యీ గ్రామాలుగాక యితర గ్రామాల పండిన ధాన్యానకు దశాంశమున్నూ, శీమామూలం ప్రతి గ్రామములందున్ను పధారుచారల ఘడకు వెద్దవూరికి ఇన్నూరు కుంటులున్ను యీలాగు నిర్ణయించేసి రామతీర్థం మొదలైన ఆరుగ్రామాదుల యందున్న, అష్ట భోగస్వామ్య స్వతంత్రములున్ను, చతుర్విధ యోగాంక సహిరణ్యోదక వ దాన ధారాపూర్వకంగా యిప్పిస్తిమిగనుక... ... ...పారంపర్యమున్ను అందుల వచ్చిన ఫలం..." చీమకుర్తి శాసనము (ఎపిగ్రాఫికా ఇండికా 1921 pp 271-72)

ఈలాంటి సమగ్ర శాసనాలు తెలుగు వచనంలో చాల ఉన్నవి. ఈ శాసనాల్లోని ప్రధాన లక్షణాలను ఈ విధంగా పేర్కొనవలె.

1. ఇంతకు పూర్వం వెలువడిన శాసనాల్లోవలెనే, వీటిలోను వ్యావహారిక పద్ధతిలో వాక్యరచన ఉండడము. (గ్రామాలు, ఇప్పిస్తిమి, కుంటలున్ను మొ॥).
2. భావ వ్యక్తీకరణం సమగ్రంగా ఉండడము, పునరుక్తి రాహిత్యం.
3. పరిపూర్ణ వాక్య విన్యాసక్రమం.
4. విశిష్టమైన శబ్దాల మార్పు - ఆ విధంగా అనుప్రాసాది శబ్దాలంకార ప్రయోగం. (అనవరత పురోహిత కృత సోమపాద - శ్రీ పర్వత అహోబల నిర్మిత సోపాన మొ॥).
5. ఇంతకు పూర్వం వెలువడిన శాసనాల్లో లేని విశేష పదజాలాన్ని ఉపయోగించడం (మన్నియ = ప్రభువు; పట్టా = భూమి; కుంట లేక గుంట = భూపరిమాణం; మొ॥).

రెడ్డిరాజుల శాసనాల తరువాత చెప్పదగినవి విజయనగర ప్రభువుల శాసనాలు. క్రీ.శ. 1336 సంవత్సరంలో హరిహరుడు, బుక్కరాయలు స్థాపించిన యీ రాజ్యం 1565 సంవత్సరంలో జరిగిన తాళికోట యుద్ధం వరకు కొనసాగింది. పరాక్రమవంతులు, సాహిత్య కళాపోషకులూ, అయిన అనేక సార్వభౌములీ మధ్యకాలంలో ఆంధ్రదేశాన్ని వైభవోపేతంగా పరిపాలించినారు. ఈ రాజులు స్వయంగాను, వారి అనుయాయులు అయిన సామంత దండనాథాది రాజకీయో ద్యోగులూ, ఈ కాలంలో అనేక దాన శాసనాలను వేయించి నారు. అదృష్టవశాన మనకీ యుగంలో ఏబదికి పైగా వచన శాసనాలు లభించినాయి. ఈ శాసనాలన్నీ విషయాన్నిబట్టీ, భాషను బట్టీ సమగ్రంగా వున్నాయి. ఈకాలం నాటికి ఆంధ్ర భాషలో విస్తృతంగా గ్రంథ రచన జరగడం. భాషకు ఒక ప్రామాణ్య స్థితి రావడం దీనికి కారణాలు కావచ్చు. ఇతఃపూర్వం వెలువడ్డ శాసనాలకువలెనే పెక్కు విజయనగర రాజ్య శాసనాలు, వ్యావహారికంగా ఉండే వచనంలో ఉన్నాయి. ఈ శాసనాలను పండితులు మాత్రమే కాక, సామాన్యులు కూడ గ్రహించవలసిన అక్కర ఉండడం చేతను, శాసన రచయితలందరూ విశేష పాండిత్యం కలవారు కాకపోవడంచేతను, ఈ శైలి అమల్లోకి వచ్చి ఉంటుంది. ఈ శాసనాల్లో అనేకంగా అన్యభాషాపదాలు

ఉపయోగింపబడడం, ఈ సందర్భంలో పేర్కొనదగిన విశేషాల్లో ఒకటి. పాదనః, జరగరు, మామూలు, దివాణము, రొఖ్ఖము, మక్తా, ఖరీదు మొదలగు పదాలను ఉదాహరించవచ్చు. ఈ పదాలన్నీ పర్షియన్, ఉర్దూ భాషల్లో వాడుకలో ఉండగా, ఆ భాషల్లోనుండి మన భాషలో ప్రవేశించినట్టివే. చారిత్రకంగా ఆనాడు ముసల్మానుల ప్రభావంసమస్త భారతదేశంతో పాటు ఆంధ్రదేశంపైన కూడ ఉండడం వలన వారి భాషల్లోని శబ్దాలు మొదట జనవ్యవహారంలోను, తరువాత నాటి వ్రాతల్లోను ప్రవేశించి ఉండవచ్చు. ఈ శాసనాల్లో, తెలుగుకావ్యాల్లో వలె చూర్ణికలు, ఉత్కళికాప్రాయాలు, ఒక్కొక్కసారి పద్యగందులు అనే వచన వైవిధ్యాలు కూడ కనిపిస్తాయి. ఈ విశేషాలన్నిటికి ప్రతిబింబంగా ఉన్న ఈ శాసనం ఉద్ధరించతగి ఉన్నది.

"స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవర్షంబు 1440 అగునేంటి బహుధాన్య సంవత్సర వైశాఖ శు॥ 15 శ్రీమన్మహా రాజాధిరాజ రాజ, పరమేశ్వర శ్రీవీర ప్రతాప శ్రీకృష్ణదేవ మహారాజులుంగారు పృథివీ రాజ్యం సేయుచుండగాను, సాళువ తిమ్మరుసయ్యం గారు మహా ప్రధానులై నడువం గాను, వశిష్టగోత్రం సూర్య వంశోద్భవులైన హంస బిరుదగండ సహకార బాంధవ మల్లికావల్లభాభరణ రంగభైరవ గండధనంజయ బిరుదాంకితులైన బెజవాడ దుర్గావర ప్రసాదులైన మాధవవర్మ వంశోద్భవులైన కంఠమహారాజు గారి కొమారుండు..."

(South Indian Inscriptions. Vol. IV. No.789)

వ్యావహారిక భాష తెలుగులో ఒక పరిణతిని పొంది పరిపూర్ణత్వాన్ని ప్రయోజనాన్ని, పొందడం విజయనగర యుగశాసనాల్లో కాన్పించు ప్రత్యేకత.

ఆంధ్ర రాజులై ఆంధ్రేతర ప్రాంతాలను పరిపాలించిన నాయక రాజులు కూడ కొన్ని తెలుగు శాసనాలు వెలయించి వున్నారు. కాని, వీటి సంఖ్య స్వల్పంగా ఉన్నది. ఆంగ్ల నాగరికత ప్రభావం మనవారి మీద ప్రసరించడం చేతకాబోలు, పత్ర వ్యవహారానికి ప్రాచుర్యం వచ్చి, నాయక రాజులకాలంలో శిలాతామ్ర శాసనాల ప్రయోజనం తగ్గిపోయింది. ఈ కాలంలో విజయరాఘవ నాయకుడు వేయించిన నమ్మిక శాసనం వెలువడింది. ఈ శాసనాన్ని శాసన ప్రకటనకర్త రజతపత్రంపై

వ్రాయించినాడు. ఈ శాసనం ఇండోనీషియాలోని బటేవియా మ్యూజియంలో భద్రపరుపబడింది. ఇదికాక, విజయరంగ చొక్కనాధుని జంబుకేశ్వర శాసనం, మధుర మీనాక్షీదేవి శాసనం, అనేవి మాత్రమే లభిస్తున్నాయి. వీటిలో మొదట చెప్పిన నమ్మిక శాసనం, ప్రాచీన శాసన రచనా సంప్రదాయానికి భిన్నంగా ఉన్నది. ఒకానొక సందర్భంలో డచ్చివారికి వ్యాపార నియమాలను విధిస్తూ, ప్రకటించిన శాసనమిది. నిజానికిది దానపత్రంకాదు. నమ్మికపత్రం (Agreement) మాత్రమే. దీనిలో విషయానికే ప్రాధాన్యం ఉన్నది. వోలందా, కుంపునీ, పరంగి. మున్నగు అన్యభాషా పద ప్రయోగం దీనిలో ఉన్నది. ఇక ఆ తరువాతనైనా దాన శాసనాలు సంప్రదాయ బద్ధమైన శాసనాలే. విజయనగర యుగ శాసనాల్లో గల సర్వపరిణత వచన లక్షణాలు వీటిలో ఉన్నవి. అందుచేత ప్రత్యేకంగా వీటిని గురించి చెప్పవలసిందంతగా లేదు. మొత్తం మీద వ్యావహారిక వచన రచనా పరిణామానికి వివిధకాలములలో వెలువడిన శాసనాలు ఆలంబములైనాయి. వాటిలో ఆనాటి సాంఘిక రాజకీయ భాషా విశేషాలు స్పష్టంగా ప్రతిబింబిస్తున్నవి.

ఆంధ్ర మహాభారతము - వచనము రచనము

ఆంధ్ర పద్య విద్యకు వలెనే సలక్షణమైన గద్య విద్యకు కూడ ఆద్యుడు నన్నయభట్టు. తెలుగులో ఆదికావ్యమైన మహాభారతం చంపూ గ్రంథం. “గద్య పద్య మయం కావ్యమ్ చంపూరిత్యభిధీయతే” అనుదాన్ని బట్టి ఈ కావ్యంలో పద్యాలకు వలెనే, వచనములకు కూడ సముచిత స్థానం లభించింది. దీనిలో మూడింట రెండు వంతులు పద్యాలుండగా, మూడవ భాగం వచన మాక్రమించింది. ఈ వచనం కూడ పద్యాలకు తీసిపోయేదికాదు. ప్రత్యేక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రచింపబడినట్టిది. కావ్యశిల్ప వైలక్షణ్యమును సంతరించుకొన్నట్టిది. కేవలం నన్నయ రచనలోనే 1431 వచనములున్నవి. వీటిలో కొన్ని సంక్షిప్తంగా ఉన్నమాట నిజమేమైనా పెక్కు వచనాలు సముచితమైన దైర్ఘ్యాన్ని కలిగి కావ్య ప్రయోజన సాధికాలుగా ఉన్నాయి. ఇక నన్నయభట్టు ఈ వచనముల వలన ఏమి ప్రయోజనాలకు సాధించినాడు అనే విషయాన్ని పరిశీలింతాము.

ఆంధ్ర మహాభారత మితిహాస కావ్యం కావడంచేత, ఆయా సందర్భాల్లో వంశానుక్రమణికలు చెప్పవలసి వచ్చును. కావ్య రచనా విశారదుడైన నన్నయ ఇటువంటి సందర్భాల్లో వచనాలనే కూర్చుతూ ఉంటాడు. పద్యాన్ని రసవంతమైన ఘట్టాల్లో రచించడం మంచిది అని భావించేవాడు నన్నయ. అందుచేత వచనములకు చక్కని ప్రయోజనాన్ని కావ్యానికి ఔచిత్యాన్ని సమకూర్చినాడు.

మహాభారతంలో ప్రధానంగా కౌరవ పాండవుల కథ చెప్పవలసి ఉంటుంది. కాని ప్రసక్తాను ప్రసక్తంగా, ఉపాఖ్యానాలను కూడ చెప్పవలసి ఉంటుంది. ఈ ఉపాఖ్యానాలు అనబడే కథలు మహాభారతంతో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, సంబంధం కలిగి ఉంటాయి. ఇవి సంఖ్యలో నూటఏబదికి పైగా ఉన్నాయి. వీటిలో కొన్ని దీర్ఘములైనట్టివి. నలచరిత్ర వంటిది వీటికి ఉదాహరణ మవుతుంది. ఇక సందర్భాన్నిబట్టి చిన్న కథలుకూడ చెప్పవలసి ఉంటుంది. ఇవి రమ్యమై రసవంతములైనప్పటికి దీర్ఘములుగా చెప్పవీలులేదు. ఆ విధంగా చేస్తే ప్రధాన కథకు భంగం కలుగుతుంది. కావ్య శిల్పం విచ్ఛిన్న మవుతుంది. ఇటువంటి సందర్భాల్లో కవి, సంక్షిప్తీకరణాన్ని ప్రధానంగా అవలంబించవలసి ఉంటుంది. ఇటువంటి వేళల్లో పద్యాన్ని గ్రహిస్తే దానికి పాదసంఖ్య నియమితం కావడంచేత సంక్షిప్తీకరణం జరగదని కాబోలు, నన్నయ వచనమునే గ్రహిస్తు ఉంటాడు. ఒక ఉదాహరణ ఈ అంశాన్ని స్పష్టపరుస్తుంది. ప్రసంగవశాన వసురాజు కథను చెప్పవలసి వచ్చింది. ఈ కథ రసవంతమైందికూడ. కాని ప్రధాన కథతో విశేష సంబంధ కలిగింది కాదు. అందుచేత దాన్ని సంక్షిప్తంగా చెప్పవలె. ఈ విషయాన్ని శ్రద్ధగా గమనించిన నన్నయభట్టు కేవలం ఆరు పంక్తుల వచనంలో దీన్ని సంక్షిప్తీకరించినాడు. పద్యాన్ని గ్రహిస్తే కనీసం నాలుగైదు పద్యాలు, అంటే 16-20 పంక్తులైనా కావలసి వచ్చేవి. కాని, వచనంలో ఇది అతి సంక్షిప్తంగా ఇమిడి ఒక ప్రయోజనం సిద్ధమైంది. ఆంధ్ర మహాభారతంలో వచనంచేత ఇటువంటి ప్రయోజనాన్ని సాధించడం చాలచోట్ల చూడవచ్చు.

కవి కథను చెప్పేటప్పుడు కథనం చేయవలసి వస్తుంది. నన్నయగారూ, ఆయన తరువాతి మహాభారత కవులూ, కథనం చేసేపట్ల వచనమునే ఉపయోగిస్తూ వచ్చినారు. ఇదికాక, సంభాషణలు, అందును చిన్నవి, చెప్పవలసిన చోటులలో నన్నయ వచనమునే ఉపయోగిస్తూ ఉంటాడు. దీనివలన కథకు నాటకీయత ఏర్పడుతుంది. గరుత్మంతుని కథలోని, కద్రూ వినతల యీ సంభాషణ యీ యంశాన్ని చక్కగా చిత్రిస్తుంది.

"కవి కద్రువ వినతంజూచి, చూడవె, యల్ల యతిధవళంబైన యశ్వంబు నందలి సంపూర్ణ చంద్రునందు నల్లయుంబోలె వాలప్రదేశంబునందు నల్లయై యున్నయది యనిన విని వినతనగి నీవేకన్నులం జూచితేయక్క; యెక్కడి నల్ల? యీ యశ్వరాజమూర్తి మహాపురుషు కీర్తియుంబోలె నతి నిర్మలంబై యొప్పుచున్న యది."

ఇట్లు వ్రాయడం చేత కథకు ఎంతటి సహజత్వ మేర్పడిందీ, వేరుగా చెప్పనవసరం లేదనుకొంటాను.

వర్ణన అనే అంశం ఏ కావ్యంలోను ప్రధానమైనట్టిదే. మహా భారతానికి ఐతిహాసికత అనేగుణం ఉన్నప్పటికీ, సందర్భానుసారంగా వర్ణనలు చేయవలసి వస్తూనే ఉంటుంది. నన్నయభట్టు, వర్ణనల సందర్భాల్లో, కేవలం వచనములనే ఉపయోగించి నాడని చెప్పడం సముచితంకాదు కాని. పద్యాలతోబాటు హృద్యంగా ఉండే వచనాలను కూడ కూర్చి ఉన్నాడు. ఈ సందర్భంలో అలంకార ప్రయోగంలోకాని, భావ వ్యక్తీకరణలోకాని పద్య గద్య భేదాన్ని అతడు పాటించినట్లే కాన్పించదు. ఈ కవి రెండు సందర్భాల్లో శ్లేషాలంకారాన్ని ఉపయోగించినాడని విమర్శకుల అభిప్రాయం. సముద్ర వర్ణనలో వచనాన్ని శ్లేషాలంకారాన్వితంగా రచించి ఒక శ్లేషాలంకారాన్ని గద్యానికి కూడా వినియోగించినాడు. ఇది చూడదగింది.

"... కరిమకర నికరాఘాత జాతవాతోద్ధూత తరంగాగ్ర సముచ్చలజ్జల కణాసారచ్ఛటాచ్ఛాదిత గగన తలంబైన దాని, నుద్యానవనంబునుంబోలె బహు విద్రుమ లతాలంకృతంబైనదాని, నాటక ప్రయోగంబునుబోలె ఘనరసపాత్ర శోభితరంగ రమ్యంబై నదాని, దివంబునుంబోలె నహిమకర భరితంబైనదాని మరియు" (ఆది - 2-27).

శ్లేషాదికములు లేని వర్ణనలు ఈ విధంగా ఉంటవి. "శాస్త్రవిహిత ప్రమాణోపేత వృత్తాయామంబును, నపాకృత వృక్ష గుల్మ వల్మీకంబును. నంగీకృత పూర్వోత్తర ప్లవంబును, సమీకృత నిమ్నోన్నత ప్రదేశంబును. దూరీకృత కంటక పాషాణశల్య శకలంబును, విరజీకృత రజోధూసర స్థలంబును విరచిత బహువిధ ప్రేక్షాగారాంచిత మంచ మణిమయ ప్రపంచంబును, ననాధ్యజ పల్లవతోరణ చందన మాల్యాలంకృత ద్వారదేశంబును, బ్రతిదిన నిర్వర్తిత శాంతిక బలి విధానంబుగా జేయించిన..." (ఆది - 6-9).

కుమారాస్త్రవిద్య సందర్శన ఘట్టములోని వచనమిది.

ప్రసన్న కథా కలితార్థయుక్త, అక్షర రమ్యత, నానారుచిరార్థసూక్తి నిధిత్వము అనువాటిని, నన్నయ తన కవితకు ప్రధానాశయాలుగాపేర్కొన్నాడు. ఈ అంశాలను పరిశీలిస్తున్నప్పుడు పండితులలో చాలామంది పద్యాలనే గ్రహించినారు కాని వచనాల జోలికి పోలేదు. కాని పరిశీలనా దృష్టితో జాగ్రత్తగాపరిశీలిస్తే ఈ సల్లక్షణాలు వచనంలోను కాన్పిస్తాయి. పైన చెప్పిన నన్నయగారి సంక్షిప్తీకరణ పద్ధతి, సంభాషణలో వచనాలను ఉపయోగించడం అనేవి వచనాలు వ్రాసే సందర్భంలో ప్రసన్న కథాకథక పద్ధతి ఏవిధంగా ప్రయోగించినాడో స్పష్టంచేస్తాయి. ఆ విధంగానే అక్షర రమ్యత అనే గుణానికి ఈ పద్య గద్యాలను తులనాత్మకంగా పరిశీలించవలసి ఉంటుంది.

"సాల ప్రాంశు నిజోజ్జ్వలత్కవచు శశ్వత్కుండలోద్భాసితున్
బాలార్క ప్రతిమున్ శరాసనధరున్ బద్ధోగ్రని స్త్రింశు శౌ
ర్యాలంకారు సువర్ణవర్ణు ఘను కర్ణాఖ్యున్ జగత్పూర్ణ పూ
ర్ణాలోలద్గుణు జూచిచూపఱు ప్రభూతాశ్చర్యులై రచ్చటన్.

"ఆచార్యుండు శుక్లాంబరాభరణ మాల్యానులేప యజ్ఞోపవీత ఫలిత కేశశ్మశ్రు దేహుండయి, రంగమధ్యంబున నశ్వత్థామ సహితుండయి విముక్త జలదజాల వియన్మధ్యంబున నంగారక సహితుండయిన యాదిత్యుండునుబోలె నున్న నగణ్యభూసురవరేణ్య పుణ్యాహ వాచనానంతరంబున."

పద్యంలో ఉన్న అక్షర రమ్యత ఈ వచనంలో లేదనడం ఎట్లా సాధ్యమవుతుంది?

లోకజ్ఞుడగు నన్నయ తన కావ్యంలో వివిధ సూక్తులను నిక్షిప్తం చేసి నానా రుచిరార్థ సూక్తి నిధిత్వం అనే గుణాన్ని సార్థకం చేసికొన్నాడు. ఇదివరలో విమర్శకులు ఈ సూక్తులను కూడ పద్యాల్లోనే వెదకినారు కాని, వచనములను పరిశీలించినట్లు కాన్పించదు. కాని, సరిగా చూస్తే, ఇవి వచనాల్లో కూడ సమృద్ధిగా కన్పిస్తాయి. వైదికములు, వర్ణాశ్రమధర్మ సంబంధములు, లౌకికములు మొదలైన సూక్తులు వచనాల్లో కనిపిస్తున్నవి. ఈ కొద్ది వాక్యాలీ విషయాన్ని స్పష్టంచేస్తాయి.

'జ్ఞాదజ్ఞాత్సంభవసి'

'కామ ప్రవృత్తుండయ్యును మహీపతి మహీసురవర పురస్సరుండగు నేని యెల్ల యుద్ధంబుల శత్రుల జయించు'.

రాజులకు గార్యవశంబునంజేసి మిత్రామిత్ర సంబంధంబులు సంభవించు!

'బుద్ధిగలవారికిఁ గ్రోధంబు గొనియాడందగదు'

'పతినియోగించిన పనిచేయని నాడు భార్యకుం బాతకమగు'. ఇట్టివి అనేకములు నన్నయగారి వచనాల్లో ఉన్నవి. ఇవి ఆనాటిసాంఘిక విశేషాలను నాటి సాంఘిక నిర్మాణాన్ని చెప్పక చెప్పుతూ ఉన్నవి.

లక్షణకారులు విధించిన చూర్ణిక, ఉత్కళికాప్రాయాలు, వృత్తగంధి, అనేరీతి వైవిధ్యం కలిగిన వచనాలు నన్నయ వచన రచనలో ఉన్నవి. వాటిని విశదంగా వ్రాయడానికి ఇచట అవకాశంలేదు కాని, ఇటువంటి రచనలు వచన రచనలో వైవిధ్యం కలిగించి కావ్యాన్ని రసవంతంగా చేయడంలో తోడ్పడినాయి.

నన్నయ తరువాత ఆంధ్ర మహాభారత రచనకు పూనుకొన్న తిక్కన, ఎఱ్ఱన చాలవరకు నన్నయ అడుగుజాడల్లోనే వచన రచన గావించినారు. కాని, తిక్కన తన రచనమున వచన పరిమాణమును తగ్గించి యిరువదియైదు శాతము మాత్రమే వచనమున వ్రాసినాడు. ఇతడు తన పద్యాల్లోవలెనే తత్సమ పదప్రయోగాన్ని తగ్గించి, దేశ్యపదోపయోగాన్ని అధికం చేసి వ్రాసినాడు. తిక్కన యుద్ధములు వర్ణించే సందర్భాల్లో వ్యూహ రచనను గురించి చెప్పవలసివస్తే విధిగా వచనాన్ని మాత్రమే గ్రహిస్తూ

ఉంటాడు. దీనివలన రచనలో వస్తువైశద్యం ఏర్పడుతుంది. ఈ గుణాలన్నీ, తిక్కన స్వతంత్ర ప్రవృత్తినీ, నన్నయపై అతనికిగల గౌరవాన్ని వ్యక్తం చేస్తాయి. ఎఱ్ఱాప్రెగ్గడ కూడ తనకు పూర్వులైన కవిద్వయాన్ని మహాభారత రచన సందర్భంలో అనుసరించినాడు. కాని, అతడు రచించిన నృసింహ పురాణంలో వచనానికి ఒక ప్రముఖ విశేషం కల్పించినాడు. దానిలో ఎఱ్ఱన అంగవర్ణన వచనము. స్తంభోద్భవ వచనము అనే శీర్షికలలో ప్రత్యేక వచనాలను వ్రాసినాడు. ఇవి గంభీర గమనంతో కూడి ఉత్కళికాప్రాయాలు అనదగి ఉన్నాయి. అంగవర్ణన వచననాల నిశ్చల వర్ణనానికి, స్తంభోద్భవ వచనం చలనాత్మక వర్ణానికి ఉత్తమ ఉదాహరణలని చెప్పవచ్చు. ఓజోగుణ ప్రధానాలై వచనములు వ్రాయడంలో ప్రథముడు ఎఱ్ఱాప్రెగ్గడయే. నాచన సోమనాథుడుకూడ ఉత్తమ వచన రచన చేసినాడు. ఉత్తరహరి వంశంలోచాల చోటుల్లో వర్ణన సందర్భాలలో వచనములు కన్పిస్తూ ఉన్నవి. ఇవికూడ నృసింహ పురాణంలో వలె గంభీర గమ్యం కలిగినట్టివే, ఇట్లు చూడగా. ఎఱ్ఱాప్రెగ్గడ. నాచన సోమనాథుడు. మునుముందురాబోయే ప్రబంధ కర్తల వచన రచనకు మార్గదర్శకులైనారని చెప్పవలసి ఉంటుంది. ఉత్తర హరివంశంలోఒక అచ్చతెనుగు వచనం ఉన్నది. దీన్ని సర్వజ్ఞుడగు నాచన సోమనాథుడు తన పాండితీ ప్రకర్షను ప్రకటించడానికే వ్రాసి ఉంటాడు.

పోతన - శ్రీనాథుడు

ఆంధ్ర వాఙ్మయంలో పోతన రచించిన మహాభాగవతానికి ప్రత్యేక స్థానం ఉన్నది. ఆంధ్రులకు అభిమాన పాత్రమైన భక్తి అనే భావానికి రసస్థాయిని కలిగించి కావ్య రచన చేసినవాడు పోతన. నూతనంగా అనుప్రాసాది శబ్దాలంకారాలను కూర్చి, పండితులను, పామరులను సమానంగా రంజింపచేసిన వాడుపోతన. పోతనకుగల ఈ రెండు ప్రధాన గుణాలు కేవలం పద్యాలకే పరిమితంకాలేదు. తన కావ్యంలో ఇరువది శాతం రచించిన వచనాల్లో కూడ ఈ గుణాలు ప్రత్యక్షంగా కన్పిస్తున్నవి. పోతన జీవించిన కాలం - అంటే క్రీ.శ. 15వ శతాబ్ది - నాటికి తెలుగులో స్తుతికావ్యాలనబడే భక్తి రచనలు వెలువడినాయి. ఇవి వచనైకములే అయినా, పోతన వాటిచేత ప్రభావితుడై, సరళ సుందరంగాను, భక్తిప్రధానంగాను ఉండే స్తుతి వచనాలను

రచించినాడు. సామాన్యంగా ఇటువంటి వచనములు, దేవా, ఈశా, వంటి సంబోధనలతో ప్రారంభమై నమః, నమస్తే, అనే పదాలతో అంతమవుతూ ఉంటవి. ఈ వచనమును పరిశీలించండి.

"దేవా, సర్వభూతాంతర్యామియై భగవంతుడవైన నీకు నమస్కరించి మదీయవాంఛితంబు విన్నవించెద నవధరింపుము. అవ్యక్త రూపంబులై వెలుంగు భవదీయ స్థూల సూక్ష్మరూపంబులును, నానాశక్త్యుప బృంహితంబులైన బ్రహ్మాది రూపంబులును, నీయంత నీవే ధరియించి, జగదుత్పత్తి స్థితిలయం బులం దంతు కీటకంబునుంబోలె గావించుచు, నమోఘ సంకల్పుడవై లీలా విభూతిం గ్రీడించు మహిమంబు దెలియునట్టి పరిజ్ఞానంబు కృపసేయుము. భవదీయ శాసనంబున గజన్నిర్మాణంబు గావించునప్పుడు బ్రహ్మాభిమానంబునజేసి యవశ్యంబును మహదహంకారంబులు నామదింబొడముం గావున, తద్పరిహారార్థంబు వేడెద; నన్ను గరుణార్ద్ర దృష్టి విలోకించి దయసేయుము" (ఆంధ్ర మహాభాగవతము. 2-249).

ఇక గద్యపద్యాల్లో అనుప్రాసాది శబ్దాలంకారాలను ఈ కవి ఒకే విధంగా ఎట్లుపయోగించినాడో తెలిసికొనడానికి ఈ క్రింది ఉదాహరణ ఒకటి చాలు ననుకుంటాను.

"భూసురుడవు బుద్ధి దయా-భాసురుడవు శుద్ధవీర భటసందోహా
గ్రేసరుడవు శిశు మారణ - మాసుర కృత్యంబు ధర్మముగునే తండ్రీ"

"...ప్రథమ కవితా రచన విద్యా విలాసాతిరేకి వాల్మీకి నుతియించి హయగ్రీవ దనుజకర పరిమిళిత నిగమ నివహ విభాగ నిర్ణయ నిపుణతా సముల్లాసునకు వ్యాసునకు మ్రొక్కి, శ్రీమహా భాగవత కథాసుధారస ప్రయోగికి శుకయోగికి నమస్కరించి, మృదు మధుర వచన వర్గ పల్లవిత స్థాణునకుం బాణునకుం బ్రణమిల్లి, కతిపయ శ్లోక సమ్మోదిత సూరు మయూరు నభినందించి మహాకావ్యకరణ కళావిలాసుం గాళిదాసుం గొనియాడి, కవికమల రవిం భారవిం బొగడి..."

ఇట్టి వచనములే అనేక సందర్భాల్లో కనిపిస్తవి. ఈ అలంకారిక రచన వలన, పోతన గారి పద్యాలకు వలెనే వచనములకు కూడ ఒక వింత సొగసు సమకూడింది.

ఇదికాక, వంశానుక్రమణికల్లోను, వర్ణనలోను, తత్త్వోపన్యాస విస్తరణంలోను పోతన సముచితంగా వచనమును ఉపయోగించినారు.

సూక్ష్మంగా ఉండే విశేషాలను వదలి స్థూలంగా చూచినప్పుడు శ్రీనాథుడు తన కావ్యాల్లో రచించిన వచనాలు కూడ పోతన గారి వచనముల వంటివే అని చెప్పవలసి వుంటుంది. శ్రీనాథుడు కూడ తన గ్రంథాలను చంపువులుగానే రచించినాడు. ఈ గ్రంథాల్లో అచ్చటచ్చట స్తుతి వచనాలున్నవి. కాని, పోతనకు ఉన్న శబ్దాలంకారాభిమానం శ్రీనాథునికి లేదు. అందుచేత శ్రీనాథుడు రచించిన వచనాల్లో శబ్దాడంబర మంతగా కాన్పించదు. వర్ణనము లందు, తాత్త్విక విశేష వివరణలలో వచనాలనే ఉపయోగించి, శ్రీనాథుడు పోతనతో ఈ విషయంలో ఏకీభవిస్తాడు. ఈ విశేషాలన్నింటిని చూచినప్పుడు కవిసార్వభౌముడైన శ్రీనాథుడు వచనమును సముచితంగా ఉపయోగించినాడనీ, దాన్ని రచించడంలో తగిన శ్రద్ధ కనబరచినాడని చెప్పిన సమంజసంగా ఉంటుంది.

ప్రబంధాలు

క్రీ.శ. 16వ శతాబ్దంలో ఆంధ్ర సాహిత్యం ఒక ముఖ్యమైన మలుపు తిరిగింది. దాని పరిణామంగా తెలుగు సాహిత్యంలో నూతన ప్రక్రియ అయిన ప్రబంధం ఆవిర్భవించింది. ప్రబంధరచయితల సాహిత్య దృష్టి తత్పూర్వుల కన్న భిన్నంగా ఉంటుందనడం నిర్వివాదం కదా. కథా విధానంలో, వర్ణన ఘట్టాలసందర్భంలో, శబ్దోపయోగంలో, ప్రబంధకవులు అనేక నూత్న మార్గాలను అవలంబించినారు. ఇటువంటి నూత్న దృష్టి కేవలం పద్య రచనకు మాత్రమే సీమితంకాలేదు. ప్రబంధాలు కూడ చంపూ రచనలు కావడంచేత విధిగా ఆ రచయితలకు వచనం రచింపవలసియే వచ్చింది. ఇదివరకు వచ్చిన గ్రంథాల్లో వచనం ఇరువది శాతం (దాదాపుగా) ఉండగా, ప్రబంధాల్లో ఈ నిష్పత్తి పది నుండి పదిహేను శాతం మాత్రమే ఉన్నది. అంటే, వీరు వచనమునకు ఉండే ప్రయోజనాలను పరిమితం చేసినారని చెప్పవలసి వస్తుంది. పూర్వ కవులు, రచనకు సంబంధించినంతవరకు గద్యపద్యాలను సమానంగానే భావించినారు. కాని, ప్రబంధ కర్తలు వచన రచనలో కఠిన శైలినే అవలంబించినారు.

వారి పాండితీ ప్రకర్షను ప్రదర్శించడానికీ, వచనాలే పట్టుకొమ్మలైనాయి. మను చరిత్రలో అల్లసాని పెద్దన వ్రాసిన ఈ వచనం చూడవలసిందే.

"లంబమాన రవిరథతురంగ శృంగార చారు చామరచ్ఛటా ప్రేక్షణ క్షణోద్భవ చమర సముదయంబగు నుదయంబునంగల విశేషంబులు శేషఫణికి నైన లెక్కింప శక్యంబె? యంధకరిపు కంధరావాస వాసుకి వియోగభవధుర్యథా భోగభోగినీ భోగభాగ పరివేష్టిత పటీర విటపి వాటికా వేల్ల దేలాలతా వలయంబగు మలయంబునం గలుగు చలువకు విలువ యెయ్యది; యక్కట కట! వికట కూట కోటి విటంక శృంగాటకా ధౌకమాన శరదిందు బింబగళ దమృతబిందు దుర్దినార్ద్రీకృత సల్లకీపల్లవ ప్రభంజన పరాంజన హస్తి హస్తం బగు సప్తంబునంగల మణి ప్రస్తరంబుల విశ్రాంతి జింతించిన మేనం బులకలిప్పుడుం బొడమెడు..."

ఈ వచనమునకు ముందున్న పద్యంలో ఈ శబ్దకాఠిన్యం లేనేలేదు. చూడండి.

"కేదారేశు భజించితిన్; శిరమునన్ గీలించితిన్ హింగుళా
పాదాంభోరుహముల్, ప్రయాగ నిలయున్ బద్మాక్షుసేవించితిన్
యాదోనాథ సుతాకళత్రు, బదరీనారాయణుం గంటి, నీ
యాదేశంబననేల? చూచితి సమస్తాశావకాశంబులన్"

ఛందోరహితమైన రచన వచ్చేటప్పటికి, ప్రబంధకర్తలకు అనివార్యమైన ఓజోగుణం కలుగుతుంది అనే అంశాన్ని పైఉదాహరణ నిరూపిస్తూ ఉన్నది. మను చరిత్రలోని ఈ ఉదాహరణ, ఆకాలంలోను తరువాత వెలువడిన ప్రబంధాలకున్ను సమానంగా అన్వయిస్తుంది. రచనపట్ల ప్రబంధ రచయితల దృష్టి సమానం కావడమే దీనికి కారణం. ఇక్కడ ఒకటి రెండు విషయాలు స్పష్టంచేయవలె. రచనలో ముఖ్యంగా వచన రచనలో, ఈ కవులు ప్రమాణానికి (Quality) ప్రాధాన్య మిచ్చిరే కాని, పరిమాణము (Quntity) నకు ప్రాధాన్య మీయలేదు. అందుచేతనే ఉన్న స్వల్పమైన వచనం కూడ ఓజోగుణం ప్రధానమై అలంకారిక రచనతో ఒప్పారుతూ ఉన్నది. ఇక వచన ప్రయోజనాన్ని కూడ ఈ కవులు పరిమితంచేసినారు. సాధ్యమైనంతవరకు వర్ణన సందర్భాల్లోనే వీరు వచనాన్ని వ్రాస్తూ ఉంటారు. ఒక్కొక్కసారి శైలీ వైవిధ్యాన్ని

సాధించటానికి కూడ వీరు వచనం వ్రాయడం మనం గమనించం వచ్చు. మొత్తంమీద ప్రబంధ కర్తల వలన తెలుగు వచనం శైలీ పరిపుష్టిని సంతరించుకొన్నది.

వచనైక రచనలు - స్తుతివచనములు

క్రీ.శ. 14వ శతాబ్దంలో మొట్ట మొదటి ఆంధ్ర వచన గ్రంథం వెలువడింది. కాని, యింతకు ముందే, చంపూ కావ్యాల్లో వచనానికి ఒక స్వరూపం ఏర్పడి ఉండింది. కాని కేవలం వచనంలో గ్రంథ రచన చేసే సంప్రదాయం మాత్రం యింకా రాలేదు. క్రీ.శ. 13వ శతాబ్దంలో సోదర భాష అయిన కన్నడంలో బసవేశ్వరుడు, అక్కమహాదేవి, దేవరదాసమయ్య అనేవారు ఛందోరహితమైన స్తుతివచనాలను వ్రాసిఉండిరి. బహుశః తెలుగు రచయితలు ఆ కర్ణాటక రచయితలచేత ప్రభావితులై తెలుగులోను ఇట్టి రచనలు చేసి ఉంటారు. ఇదికాక, సంస్కృతంలో గద్యత్రయం అనే మూడు గద్యాలను స్తుతి ప్రధానంగా ఉండేవాటిని వైష్ణవ పరమాచార్యులయిన శ్రీరామానుజాచార్యులవారు రచించినారు. ఈ గద్యాలు వైష్ణవ సమాజంలో బహుళ ప్రచారాన్ని పొందినాయి. తెలుగులో వెలువడ్డ స్తుతి వచనాలకు ఇవికూడ మార్గదర్శకాలై ఉంటవి.

ఈ స్తుతి వచనాలు, రచయిత యిష్టదైవ సంబోధనతో ప్రారంభమవుతాయి. అంతంలో నమోవాకంతో కూడిన మకుటం ఉంటుంది. సంఖ్యానియమం లేదుకాని, ఈ వచనాలు శతకాన్ని పోలినవి. శతకంలో ఏ పద్యానికాపద్యం స్వతంత్రంగా ఉన్నట్లే, స్తుతి వచనాలు కూడ వేటికవే స్వతంత్రంగా ఉంటాయి. అయినప్పటికీ, శతకాల్లో భక్తి,నీతి, వైరాగ్యం మొదలైన వస్తు వైవిధ్యం కాన్పిస్తుంది. కాని ఈ వచనములన్నింటిలోను మణుల్లో సూత్రంవలె భక్తియే ప్రధానంగా ఉంటుంది. తెలుగులో ఈ వచనాలు రెండు విధాలుగా ఉన్నవి. వైష్ణవ మత ప్రతిపాదకాలు మొదటివి. శైవమత ప్రతిపాదకాలు రెండవ విధమైనవి.

ఓరుగల్లును పాలించిన రెండవ ప్రతాపరుద్రుని కాలంలో జీవించి, అతి మానుష శక్తి సమన్వితుడుగా ప్రఖ్యాతిని వహించిన కృష్ణమాచార్యులు రచించిన సింహగిరి వచనములు అనే గ్రంథాన్ని ఈ స్తుతి వచనాల్లో మొదట పేర్కొనవలసి ఉంటుంది. సరళశైలీ సమన్వితమై భక్తిభావ బంధురమై, ఉన్న ఈ వచనాలను

కృష్ణమాచార్యులు నాలుగులక్షల సంఖ్యలో రచించెనట. కాని, మన దురదృష్టవశాన ఇవన్నీ మనకు దొరకలేదు. కేవలం అరువది వచనములు మాత్రం లభించినాయి. ఈ వచనము లొకప్పుడాత్మాశ్రయాలుగాను, ఇంకొకప్పుడు సేవ్యసేవక సంబంధ సూచకాలుగాను, ఉండి భక్తితో కూడిఉన్నట్టివి. ఈ వచనం ఉదాహరణ ప్రాయంగా ఉన్నది.

"దేవా, పెద్దతనంబుసేసి మిమ్ములను మెప్పించెదనంటినా, జాంబవంతుండు మీ సన్నిధినే యున్నాడు. దేవా, బుద్ధి మెప్పించెదనంటినా, విభీషణుండు మీసన్నిధినే యున్నాడే, దేవా, బంటుతనంబు సేసి మెప్పించెద నంటినా, హనుమంతుడు మీసన్నిధినే యున్నాడే,దేవా, తీర్థంబులాడి మిమ్ము మెప్పించెద నంటినా గంగా భవాని మీయంగుష్ఠంబునందే యున్నదే. దేవా ప్రదక్షిణలు తిరిగి మిమ్ము మెప్పించెద నంటినా, సూర్యచంద్రాదులు మీ సన్నిధినే యున్నారే. దేవా, వేదవేద్యుండనై మిమ్ము మెప్పించెద నంటినా, బ్రహ్మ మీ నాభికమల మందే యున్నాడే... సింహగిరినృహరీ. నమో నమో దయానిధీ!"

కృష్ణమాచార్యుల భక్తి భావం చేత ప్రభావితులైన పలువురు రచయితలీ విధమైన రచనలే చేసినారు. తాళ్లపాక పెద తిరుమలాచార్యులు వేంకటేశ్వర వచనములను పేర కొన్ని వచనాలను రచించినాడు. ఇవి తిరుమలలో వెలసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామికి అంకితములైనాయి. సింహగిరి వచనములవలె ఈ వచనములు కూడ ఉత్తరరచన, భావంతో కూడినట్టివి. ఈ వచనం ప్రదర్శించ దగినట్టిది.

"నీలమేఘశ్యామా, అణువునకు నణువవు; మహత్తులకు మహనీయండవు ప్రకృతి పురుషునకుం బరమాత్మవు. మూడుమూర్తులకు మూలమవు చూరాచరంబులకు సాక్షివి. ఊహించి చూచిన నొక్కండవే దేవుండవు ఏర్పరచి చచిన ననంతుండవు. వినంగడంగిన కల్యాణ గుణుండవు. కన్నులంజూచిన సాకారమవు. స్వరూపవ్యాప్తిని నిరవద్యుండవు. స్వాతంత్ర్యంబున జీవచైతన్య మవు. భక్తవరులకుఁ బ్రసన్నుండవు. తుదివిచారించిన జగత్కర్తవు ఇట్టినీగురుతు తెలియంగవచ్చు నయ్యా; పెక్కు రూపంబులు

గలవాడవు. పెక్కునామంబులు గలవాఁడవు. వేదవాదులకు నగోచరుడవు; నిన్నుంచేబట్టి కొలువ నేరము. నీవే కరుణించి కావవే శ్రీ వేంకటేశ్వరా!"

ఈ వచన రచయితలు వీరి తరువాత వారగు బమ్మెరపోతన వంటి కావ్య రచయితలను, తాళ్లపాక అన్నమాచార్యులవంటి గేయ రచయితలను ప్రభావితంచేసిరి. శఠకోపవిన్నపములు, శేషగిరినాథ విన్నపములు, మున్నగు రచనలు చూడ ఈ కోవకు చెందినట్టివే. శైవసంబంధ వచనల్లో భవానీ మనోహర వచనములు, గంగాధరయ్య వచనములు, కాశికాధీశ్వరవచనములు, మున్నగు నవి పేర్కొనదగినవి. రచనయందు మౌలికంగా ఇవికూడ సింహగిరి వచనాల వంటివేయైనా, వీటికి శైవమత విశేషాలతో సంబంధం ఉన్నది.

చారిత్రక కావ్యాలు

ఇతర భారతీయ భాషల్లో వలెనే తెలుగు భాషలో కూడ చరిత్ర రచన స్వల్పంగా ఉన్నది. మనవారు చారిత్రక వ్యక్తులను కూడ, అతి మానుషులనుగా చేసి వారి చరిత్రలను గాథలు చేసి, వాటిని అవిశ్వసనీయాలుగా మారుస్తూ ఉంటారు. అందుచేత పూర్వకాలంలో చరిత్రకు సంబంధించిన ప్రామాణిక కావ్యాలు విశేషంగా వెలువడలేదు. చరిత్ర రచనకు పద్యంకంటే వచనమే అనువైంది. అలంకారిక రచనకు అతిశయోక్తులకు వచనంలో అవకాశం తక్కువ. ఈ అంశాలను గుర్తించే కాబోలు ఏకామ్రనాథుడుఅనే రచయిత క్రీ.శ. 16వ శతాబ్దంలో ప్రతాపచరిత్ర పేరుతో ఒక వచన గ్రంథాన్ని రచించినాడు. ఈ గ్రంథ రచనా కాలంలో తెలుగులో విశేషంగా పద్యకావ్యాలు వెలువడుతూ ఉండగా, వాటికి భిన్నంగా ఉండే వచన గ్రంథాన్ని చరిత్రప్రధానమైనదాన్ని ఈతడు రచించడం చూస్తే, ఏకామ్రనాథునికి ఉన్న నూత్నదృష్టే కారణ మనిపిస్తుంది. ఈ విధంగా తెలుగు వచనంలో చరిత్రకు సంబంధించిన ప్రథమ గ్రంథం ప్రతాపచరిత్రమే.

ప్రతాప చరిత్ర కాకతీయ రాజవంశజుల్లో ముఖ్యుడై క్రీ.శ. 14వ శతాబ్ది ప్రథమ పాదంలో తెలుగు దేశాన్ని పాలించిన రెండవ ప్రతాపరుద్రని చరిత్రను తెలిపే గ్రంథం. ప్రసక్తాను ప్రసక్తంగా ఈ గ్రంథంలో కాకతీయ వంశోత్పత్తికి

సంబంధించిన విశేషాలు మాధవవర్మ మొదలగు వారి కథలు, అనుమ కొండదుర్గ వృత్తాంతం వర్ణితమైనాయి. ఇవికాక తిక్కన సోమయాజి, కుమ్మర మొల్ల, విష్ణు భక్తుడైన కృష్ణమాచార్యులు సందర్భాన్ని పురస్కరించుకొని ప్రశంసింపబడినారు. ఈ గ్రంథంలో కొన్ని అవిశ్వసనీయ విషయాలు లేకపోలేదు కాని ఇందలి అంశాల్లో చాలవరకు చారిత్రకంగా యథార్థాలని చారిత్రకులు విశ్వసిస్తున్నారు. కాకతీయ రాజ్య పతనానంతరం రెండు శతాబ్దాలకు లోపునే ఈ గ్రంథం రచింపబడటం చేత, కొన్ని మాత్రమే అచారిత్రక విషయాలు దానిలో ప్రవేశించినవి.

ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో పురాణయుగంగా భావింబడే కాలంలో ఈ గ్రంథం రచితం కావడంచేత, ఈ గ్రంథముపై పురాణ ప్రభావం అధికంగానే కానిపిస్తుంది. ఇష్టదేవతాస్తుతి, కథోపక్రమణ మున్నగు భాగాల్లో ఈ అంశం స్పష్టంగా కాన్పిస్తుంది. నన్నయాదులు ఆంధ్ర మహాభారతంలో కథనానికి ఎటువంటి శైలిని అవలంబించినారో, అదే వచన శైలిని దీనిలో ఏకామ్రనాథుడు అనుసరించినాడు. నిజానికి శైలి చాల సముచితమైనది కూడ. నిరలంకారమై సరళంగా ఉండి, పాఠకునికి యథార్థాన్ని అందించడానికి ఈ శైలి చక్కగా ఉపకరించింది.

చారిత్రక కావ్యపరంపరలో రెండవదిగా చెప్పదగినది రాయవాచకం అనే గ్రంథం. విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయలకు కొద్దికాలం తరువాతివాడై, క్రీ.శ. 16వ శతాబ్దంలో జీవించి, మధురపాలకుడైన విశ్వనాథనాయకుని రాజకీయోద్యోగి, స్థానపతి అనేవాడు ఈ గ్రంథాన్ని రచించినాడు. ఈతని పేరు తెలియదు. ఈ గ్రంథంలోని ప్రధాన వృత్తాంతం శ్రీకృష్ణదేవరాయల చరిత్ర. కాని దానికి భూమికగా, విద్యారణ్యుల వృత్తాంతము, వ్యాససాక్షాత్కారము విద్యానగర నిర్మాణము మున్నగు విషయాలు వర్ణితమైనవి. గ్రంథకర్త కావ్య వస్తువును గురించి ఈ విధముగాచెప్పినాడు.

"విజయ నగర వృత్తాంతము - సుజనులచే విన్నయట్టి నూన్నృతవాక్కుల్
ప్రజలకు తేటపడంగా - సృజియించితి కృష్ణరాయ శేఖరుచరితల్"

ఈ పదాన్ని బట్టి ముఖ్య విషయాలు కొన్ని తెలియవస్తున్నవి. ఈ గ్రంథకర్త కృష్ణదేవరాయల సమకాలికుడు కాడనీ, కాలం తరువాత నివసించి నాడనీ, అనుట మొదటిది ఎందుచేతననగా తాను 'సుజనులచే విన్నయట్టి నూనృతవాక్కుల్' గ్రంథస్థము చేసానని అన్నాడు. కాని తాను స్వయంగా చూచినవి వ్రాస్తానని అనలేదు. ఇక రెండవ విషయమేమంటే, అది కృష్ణరాయ చరిత్రకు ప్రాధాన్యం, అంటే మిగిలిన విషయాలు అప్రధానాలే అనడమన్న మాట. ఇంతకుముందు వెలువడ్డ ప్రతాప చరిత్రకూ, ఈ గ్రంథానికి పోలికలు కొన్ని ఉన్నాయి. ఈ రెండు గ్రంథాల్లోను తెలుగు దేశాన్ని పాలించి విశేషఖ్యాతినందిన చక్రవర్తులే నాయకులు. ఈ రెండు కూడ వచన గ్రంథాలే. శైలిలో స్వల్పమైన భేదం ఉండవచ్చును. కాని, వస్తువు మాత్రం రెండింటిలోను దేశ చరిత్రే. ప్రతాప చరిత్రలో మాధవశర్మ చరిత్ర ఉన్నట్లుగానే, దీనిలో విద్యారణ్య చరిత్రమున్నది. ఈ ఇద్దరూ, తమ గ్రంథాల్లోని అంశాలను విని వ్రాసిన వారే. ప్రత్యక్షంగా చూచినవారుకారు. ఈ అంశాలను పరిశీలించినప్పుడు రాయవాచక కర్త ప్రతాప చరిత్రను పఠించి దాని ప్రభావం చేత ఈ చారిత్రక గ్రంథరచనకు పూనుకొన్నాడేమో అని అనిపిస్తుంది. రాయవాచక శైలిని గురించి కొద్దిగా చెప్పవలె. ఈ గ్రంథం వ్యావహారిక శైలిలో రచితమైంది. ఒక్కొక్కసారి గ్రామ్యం అని కూడ చెప్పవచ్చును. ఈక్రింది పంక్తులు దానిలోని శైలిని ప్రతిబింబింపజేస్తాయి.

"ఇట్లు – సింహాసనస్థుండు స్వామ్యామాత్య సుహృత్కోశ రాష్ట్రదుర్గ బలంబులను రాజసప్తాంగంబుల దెలిసి, ఆందోళికాంబర ఆభరణ వాహనరాజు సన్మాన కప్పుర తాంబూలంబులను ఉచిత సప్తాంగంబులను రాశియెరుంగవలయు, సామభేద దాన దండ మాయెూపాయ ఉపేక్ష మహేంద్రజాలంబులను సప్తోపాయంబుల తెలియవలయు. రాజులకు సమస్త వ్యసనంబులు గలవు. అవి యేవంటేని స్త్రీ వ్యసనము, జూదము, జూదమాడుట, పానము. సురాపానము చేయుట, వేటపోవుట, పలుకు ప్రల్లదము, తిట్టుట, అకారణందండించుట, అనుచితం వెచ్చబెట్టుట, యీ యేడు వ్యసనములును వర్జించవలెను. ఇదిగాక సుతనిధి దేవగేహ వనతటాక కృతి బ్రహ్మ ప్రతిష్ఠ మొదలైన సప్త సంతానంబుల బడయవలయు..."

ఈ విధంగా అనేక విషయాలనీతడు ప్రస్తావించుతూ ఉంటాడు. దీనిలోనీతి. రాజనీతి కూడ ఉన్నవి ఇది మహాభారతం బద్దెననీతి, చాణక్య శతకం కవికర్ణ రసాయనం మొదలైన గ్రంథాలనుండి గ్రహింపబడినాయి. ఈ గ్రంథంలో మాండలిక పదాలు, అన్యభాషాపదాలు విరివిగా ఉపయోగింప బడినవి. పట్టెలు (ఆభరణాలు) ప్రహరి బడగరలు (ప్రహరిని రక్షించే యోధులు). చేర్వగార్లు (రౌతులు), ఉడగరులు (కానుకలు) మొదలైన పదాలను మాండలిక పదాలకుగాను, బయదలు (వదాతి యోధులు), అముస్తీదు (సిద్ధంకావడం). భరవసము (విశ్వాసం), హేజీబు (దౌత్య వ్యవహర్త) మున్నగు వాటిని అన్యభాషా పదాలకును ఉదాహరణలుగా చెప్పవచ్చు. నిజానికీ గ్రంథం ఒక రాజకీయ నివేదిక వంటిదేయైనా, పై విశేషాలవల్ల దానికి వచన సాహిత్యంలో ప్రత్యేక స్థానం లభించింది. ప్రతాప చరిత్ర ఆధారంగా సిద్ధేశ్వర చరిత్ర అనే ద్విపకావ్యం, రాయవాచకం ఆధారంగా కృష్ణరాయ విజయం అనే పద్యకావ్యం తరువాతి కాలంలో వెలువడినాయి.

దాక్షిణాత్య యుగం

విజయనగర రాజ్యపతనానంతరం ఆంధ్ర సాహిత్యరంగం తంజావూరు,మధుర, పుదుక్కోట, మైసూరు మొదలైన దాక్షిణాత్య రాజ్యాలకు మారింది. ఈ రాజ్యాల్లో ప్రాయకంగా రాజుగా, వారి అనుయాయులు తెలుగువారు కావడం చేత, తెలుగు సాహిత్యానికి విశేషపోషణ, ప్రాచుర్యం లభించింది. ముఖ్యంగా క్రీ.శ. 17, 18 శతాబ్దుల్లో ఈ ప్రాంతంలో వచన వాఙ్మయం బహుముఖాలుగా వికాసాన్ని చెందింది. కఠినతరంగా ఉండే పద్య కవిత్వాన్ని పఠించే అవకాశం కాని, పాండిత్యం గాని లేనివారు ఆ ప్రాంతాల్లో బహుళంగా ఉండడంచేత కాబోలు అనేక వచన కావ్యాలు బయలుదేరినాయి. వివిధశాఖల్లో నాడు వెలువడ్డ వచన కావ్యాలను ఇంక ప్రస్తావిస్తాను.

క్షేత్ర మాహాత్మ్యాదులు

క్షేత్ర మాహాత్మ్యాలనే స్థల పురాణాలు అంటారు. వివిధ పుణ్యక్షేత్రాలను గురించి, ఆ విషయాలు తెలిసిన విజ్ఞులు క్షేత్ర మాహాత్మ్యాదులు వ్రాసినారు. పూర్వం

శ్రీనాథుడు వ్రాసిన కాశీఖండం, భీమేశ్వర పురాణం ఇటువంటివే. ఈ యుగంలో వచ్చిన శ్రీరంగ మాహాత్మ్యము అనే వచనకావ్యం ఈ కోవలో మొదట చెప్పదగింది. దీనిని విజయరంగ చొక్కనాథుడు (1706-32) రచించినాడు. ఈతడు మధురానగర పాలకుడు. కవి పండిత పోషకుడు. వైష్ణవులు అతి పవిత్రంగా భావించే శ్రీరంగ క్షేత్ర ప్రశంస ఈ గ్రంథంలో ఉన్నది. శైలి గ్రాంథికంగా ఉండి సరళంగా ఉంటుంది. ఈతడే మాఘ మాహాత్మ్యము అనే గ్రంథాన్ని కూడ రచించినాడు. మాఘమాసంలో ఆచరించవలసిన విధులు దీనిలో విరచించడమైంది. ఇదే వరుసలో చేర్చదగిన ధేను మాహాత్మ్యాన్ని లింగనమఖికామేశ్వర కవి రంచినాడు. ఈ గ్రంథం చొక్కనాథునికి అంకితమైంది. మహాభారతాంతర్గత అనుశాసనిక పర్వం నుంచి గ్రహించి, కామేశ్వర కవి తెలుగు వచనంలో దీన్ని రచించినాడు. ఇది స్థూలంగా చూస్తే గ్రాంథిక రచనమే యైనా, వాటి, వీటి, పలుకరించు, మందలించు, ఇటీవలె, మున్నగు వ్యావహారిక పద ప్రయోగాలు దీనిలో ఉన్నాయి. ఇదే క్రమంలో చెప్పదగింది హాలాస్య మాహాత్మ్యం అనే గ్రంథం. దీన్ని కళువెవీర రాజు కుమారుడు కళువెనంజ రాజు వచన కావ్యంగా వ్రాసినాడు. దీనిలో నంజరాజు మధురలోని మీనాక్షి సుందరేశ్వరు లీలలను డెబ్బదిరెండు అధ్యాయాల్లో వర్ణించినాడు. ఇతనిదే మరియొక రచన కాశీ మహిమార్థ దర్పణము. ఇది శిష్ట వ్యావహారిక భాషలోఉన్న వచన గ్రంథం. కాశీనగర క్షేత్ర విశేషాలు దీనిలో వర్ణింపబడినాయి. ఇవిగాక గజారణ్య మాహాత్మ్యము. వేంకటాచల మాహాత్మ్యము. వైశాఖ మాహాత్మ్యము. అనేవికూడ ఇదేకాలంలో వెలువడ్డ వచన గ్రంథాలే.

పౌరాణిక కావ్యాలు

దాక్షిణాత్య యుగంలో పలు విధాలైన పురాణాలు తెలుగు వచనంలో రచితమైనాయి వీటిని మహాభారత సంబంధములు, రామాయణ సంబంధములు, వివిధములు, అవి మూడు రకాలుగా విభజన చేయవచ్చు. భారత సంబంధముల్లో మొదట చెప్పదగింది భారత సావిత్రి అనే చిన్న గ్రంథం. ఎల్లకర నృసింహ కవి దీన్ని రచించినాడు. ఇది బహుళ ప్రచారాన్ని పొందిన గ్రంథం. భారతంలోని ఉద్యోగ

పర్వంలో కౌరవ పాండవులకు సంధి రాయబారం నిర్వహించడానికి శ్రీకృష్ణుడు హస్తినానగరంలో ప్రవేశించడం, పాండవ పక్షాన ఐదూళ్లు అడగడము, సంధి వైఫల్యము, కౌరవ పాండవ యుద్ధము, భీష్మ ద్రోణ కర్ణాదుల పతనము అనే విషయాలీ గ్రంథంలో సంక్షిప్తంగా వర్ణింపబడినాయి. సరళ రచన, చిన్నచిన్న వాక్యాలు, సందర్భాను సారంగా నీతిబోధ మొదలైనవి. దీనిలోని విశేషాలు సముఖము వేంకట కృష్ణప్ప నాయకుడు వ్రాసిన జైమిని భారతము అనేవచన కావ్యాన్ని కూడ ఇట పేర్కొనవలె. విజయరంగ చొక్కనాథుని సమకాలికుడీ రచయిత. చొక్కనాథుని ప్రోత్సాహంతోనే యీ రచన చేసినట్లు కాన్పిస్తుంది. కొందరు భావించేటట్లుగా జైమిని భారతం మహా భారతానికి శేషగ్రంథం కాదు. భాగవతానికీ, వైష్ణవమతానికీ ప్రాచుర్యం కలిగిన తరువాత ఇది రచింపబడిందని పండితులు భావిస్తారు. పిల్లమఱ్ఱి పినవీరన్న పద్యకావ్యంగాను, సముఖము వేంకటకృష్ణప్ప నాయకుడు వచన కావ్యంగాను దీన్ని తెలుగులోనికి అనువదించినారు.

మహాభారతంలో వలెనే, జైమిని భారతంలో కూడ, వైదిక కర్మల ప్రశంస, యజ్ఞయాదికాల చర్చ. వర్ణాశ్రమ ధర్మ ప్రతిపాదన, మొదలైన విశేషాలు ఉల్లేఖింప బడినాయి. ఈ గ్రంథ రచయితకు శృంగార వీరభయానక రసాలనే కాక హాస్యాన్నికూడ చక్కగా పోషించే నేర్పు ఉన్నది. ఈ వాక్యాలు చూడండి “వృకోదరా, నీకు బుద్ధి మందంబు; ఆహారంబపారంబు; పొట్టరెట్టించు చున్నది. రక్కసి రతుల జొక్కినాడవు. మాటల పోబడి యెరగవు. నీ వంటివాడు మంత్రియై యున్న గార్యంబులగుటకు సందియంబేమి?”

ఈ గ్రంథంలో ప్రధాన కథయైన పాండవుల అశ్వమేధయాగ వృత్తాంతంతో బాటు, అగ్ని హోత్రునికథ. ఉద్దాలక మహర్షికథ, ప్రమీలకథ. కుశలవోపాఖ్యానము. మున్నగు చిన్నికథలు కూడ కవి వర్ణించినాడు. సందర్భాను సారంగా దీనిలో అచ్చటచ్చట స్తుతి వచనాలు కూడ ఉన్నాయి. సరళమైన గ్రాంథిక శైలితోను ఎడనెడనుండే సామెతలతోను, అలంకారాలతోను వర్ణనల తోను కూడి యీ వచన కావ్యం సుందరంగా భాసిస్తూ ఉన్నది.

భారత సంబంధి ఐన వచన కావ్యపరంపరలో కళువె వీరరాజు వ్రాసిన మహాభారతాన్ని గురించి చెప్పాలె. క్రీ.శ. 17వ శతాబ్దంలో మైసూరును పాలించిన చిక్కదేవరాయల కాలంలో నివసించిన వాడు వీరరాజు. ఈ కాలంలో మైసూరులో తెలుగు సాహిత్య పోషణకు చక్కని వాతావరణం ఏర్పడి ఉండింది. తదనుగుణంగానే మంచి కావ్యాలు తెలుగులో వెలువడినాయి. వీరరాజుకు మహా భారత రచనంలో తుపాకుల అనంతభూపాలుడు సాయంచేసినట్లు తెలియవస్తుంది. ఈ గ్రంథం నన్నయ మహాభారతానికి అనుసరణ కాదు. సంస్కృత మహాభారతానికి ప్రత్యక్షమైన అనువాదం. కొన్ని వ్యావహారిక పదాల ప్రయోగం ఉన్నా, శైలి గ్రాంథికంగానే ఉంటుంది. దీర్ఘంకాని వాక్యాలు, భావసారళ్యానికి దోహదాలుగా ఉన్నవి. ఈ భాగం చూడతగి ఉన్నది.

"ఇవ్విధంబునం గ్రోధవివశుండగు పార్థుని ప్రతాపంబునకుందలంకుచు మహీ చక్రంబులు భయంపడియె దివాకరుండు తేజోవిహీనుండయ్యె. వాయు దేవుండు విసరుటకు వెరచె. చంద్రగ్రహ తారకాగణంబులు, దిశాభాగంబులును ఎట్టిపని ఏర్పరింపబడవయ్యె. చరాచరాత్మకంబగు నిఖిల ప్రపంచంబును కలగంబారె"

కవిజీవించిన కాలంలోను, తరువాతి కాలంలోను, ఈ గ్రంథానికి ఉత్తమ ప్రాచుర్యం లభించింది. ఇదే సందర్భంలోతుపాకుల అనంతభూపాలుని అనుశాసనిక పర్వము నారాయణీయమనే వచన శాంతి పర్వము పేర్కొన దగిన గ్రంథాలు.

ఇక రామాయణ సంబంధియైన వచన కావ్యాలు : తెలుగు భాషలోని పద్య రచయితలకువలెనే, వచన కర్తలు కూడ భారతాన్ని అభిమానించినంతగా రామాయణాన్ని ఆదరించలేదు. విజయరంగ చొక్కనాథుడు మధురను పాలించిన కాలంలో శ్యామరాయ కవి అనేవాడు రామాయణమును వచనంలో వ్రాసినాడు. ఈతడు దీన్ని సమగ్రంగా వ్రాసినాడని తెలియవస్తుంది. కాని, నేను ఒక బాలకాండ మాత్రమే చూడకలిగినాను. అదికూడ ముద్రణమునందు లేదు. ఈ కవి వైశ్య కులజుడు. షడ్దర్శన పారంగతుడు. కృష్ణయామాత్య పుత్రుడు. సంస్కృతాంధ్ర భాషా కవితా నిర్వాహక సకల విద్యాపారంగతుడు. అసహాయ బిరుదాంకితుడు. తెలుగులో వచన

రామాయణం లేని కొరతను తీర్చాలని ఈతడీ గ్రంథాన్ని వ్రాయ బూనినట్లు చెప్పినాడు. ఇతని శైలి ఈ విధంగా వుంటుంది.

"సకల వృక్షములు, మృగములు, పక్షులు అన్నియు నిశ్చలములై వర్తిల్లె. ఓ రఘు కులాలంకారా, రాజకుమారాదిశలన్నియు నిశాంధకారముచే నాచ్ఛాదితమై మెల్ల మెల్లన సంధ్యయు నతిక్రాంతంబయ్యె. ఇపుడంతరిక్షమున నక్షత్రములు రోహిణ్యాదితారకలచే నిండంబడుచు నేత్రంబుల కరణి భాసిల్లు జ్యోతికణంబుల బోలెభాసిల్లు ఇపుడు లోకాంధకారంబుల విరయందోయను ధవళిత కిరణుండగుచు చంద్రుండు చంద్రికలచే లోకంబునందు వసియించు." విశిష్టమైన గ్రాంథిక శైలిలో ఈ గ్రంథం ఒప్పారుతున్నది. భారత రచనంలో కళువె వీరరాజుకు తోడ్పడిన తుపాకుల అనంత భూపాలుడు రామాయణాంతర్గత సుందరకాండను రచించినాడు. ఇది సంస్కృత రామాయణానికి తెలుగు అనువాదం. ఇదికూడ ముద్రితంకాలేదు. సరళ గ్రాంథికంలో ఉన్న వచన రచన మిది. తుపాకుల అనంతభూపాలుడే రచించిన విష్ణుపురాణం, మార్కండేయ కథ, పుష్పగిరి తిమ్మన వ్రాసిన భాగవతసారము, మాచనామాత్యుని బ్రహ్మాండ వచనము, వచన గ్రంథ పరంపరంలో పౌరాణికములుగా ఉన్నవి.

ఆంధ్ర సాహిత్యాన్ని అది వచనమైనా, మతము, మొదటినుండి ప్రభావితం చేస్తూనే వచ్చింది. ఈ ప్రభావానికిలోనై అనేక తెలుగు వచన కావ్యాలు రచితమైనాయి. దత్తాత్రేయ యోగి అనునాతడు 'వేదాంత వ్యవహార సారసంగ్రహము' అనేగ్రంథాన్ని రచించినాడు. దాసగోస్వామి 'పరమానందబోధ ప్రకరణము'ను వ్రాసినాడు. పెద్దరామకవి. 'ప్రభుదేవర వాక్యము'ను కూర్చినాడు. 'వివేక సింధువు' అనే గ్రంథం కాశీ చెన్నబసవేశ్వరునిచేత రచితమైంది. "వేదాంత వార్తికము' అనే పుస్తకం వ్రాసినవాడు పరమానందయతి. 'వివేక చింతామణి' కూడ ఈతని కృతియే. ఇదే సందర్భంలో 'క్రిస్టియన్‌వేద కథా సంక్షేపం' 'సృష్టి రహస్యం' అనే క్రైస్తవమత గ్రంథాలను కూడ పేర్కొనవలె. మత సంబంధమైన యీ వచన గ్రంథాలన్నీ క్రీ.శ. 17, 18వ శతాబ్దుల్లో వెలువడినట్టివే. ఈ గ్రంథాలన్నీ ప్రధానంగా ప్రచార దృష్టి కలిగినవికూడ. అందుచేత

వీటిలో విశేషమైన శైలిని కాని అలంకారిక రచననుకాని వెదకడం వలన ప్రయోజనం లేదు సాహిత్యపరంగా చూచినా, వీటి ప్రాముఖ్యం అంతంత మాత్రమే.

చిన్నయ సూరి

క్రీ.శ. 1857వ సంవత్సరం రాజకీయంగానేకాక, సాంస్కృతికంగా కూడ భారతదేశానికి ముఖ్యమైంది. మనదేశంలో ఈ సంవత్సరంలోనే విశ్వవిద్యాలయ స్థాపన ప్రారంభమైంది. 1857లో విశ్వవిద్యాలయ స్థాపన జరగడం, అందులో తెలుగుభాష పఠనీయం కావడం జరిగింది. దక్షిణదేశంలో రచితములైన వచన గ్రంథాలీనాటికి ప్రచురితంకాలేదు. అందుచేత గ్రాంథికంగాను, సలక్షణంగాను ఉండే వచన రచన విశ్వవిద్యాలయ విద్యార్థుల కావశ్యకమైంది. ఇటువంటి రచనకు పూనుకొన్నవాడు చిన్నయసూరి, ఆయన 1856లో నీతి చంద్రికను రచించి ముద్రించినాడు. చిన్నయసూరికి విశ్వవిద్యాలయంలో ప్రాబల్యం ఉండడంచేత, అతడు గ్రాంథిక భాషాభిమాని కావడంచేతను, గ్రాంథికవచనములు పాఠ్యాలుగా ఉండే అవకాశం లభించింది. ఇతడు పంచతంత్రాన్ని పూర్తిగా రచింప బూనినా, రచించినవి మిత్ర లాభము, మిత్ర భేదము, మాత్రమే. ఈ నీతిచంద్రిక యితర రచయితలపై ప్రబలమైన ప్రభావాన్ని కలిగించింది. పరిణామంగా నాటి రచయితలందరు గ్రాంథిక భాషనే ప్రోత్సహించిరి. రాజధాని కళాశాలలో ప్రధాన పండితులైన కొక్కొండ వేంకట రత్నం పంతులు గ్రాంథిక భాషోద్యమాన్ని స్థిరీకరించినారు. వీరు 1872లో విగ్రహమును రచించి ముద్రింపించి పాఠ్యగ్రంథంగా నిర్ణయించినారు. వేంకట రత్నం పంతులుగారే 1871లో భాషాసంజీవని అనే పత్రికను స్థాపించి గ్రాంథికభాషా ప్రచారం చేసినారు. 1877లో వీరు ప్రిన్స్ ఆఫ్ వేల్స్ హిందూ స్థానదర్శనము అనే గ్రంథాన్ని వచనంలో వ్రాసినారు. ఆ విధంగా విశ్వవిద్యాలయంలో గ్రాంథిక వచన గ్రంథాలు వెలువడుతూ ఉంటే, ప్రజాసామాన్యంలో పరమా నందగురువుల కథలు (1861), తడక మళ్ల వెంకట కృష్ణరావు వ్రాసిన అరేబియన్ నైట్సు కథలు (1862), కంబుధర చరిత్ర (1866), ఎర్రమిల్లి మల్లికార్జునుడుగారి చారుదర్వేషు కథలు (1881), చదలవాడ సీతారామశాస్త్రి గారి దక్కను పూర్వ కథలు ముఖ్యములైనవి. ఈ కాలంలోనే

కొన్ని పౌరాణిక గ్రంథాలు కూడ వచ్చినవి. సుబ్బరాయలు నాయని వారి దశావతార చరిత్ర సంగ్రహము (1861), తిమ్మరాజు లక్ష్మణరాయ కవిగారి మార్కండేయ పురాణ సార సంగ్రహము (1876), శ్రీకూర్మ పురాణ సంగ్రహము (1877) మొదలైనవి ఈ గ్రంథాలన్నీ సులభ గ్రాంథికంలో ఉన్నట్టివే.

కందుకూరి వీరేశలింగం గారు - 1890 నుండి

1890 సంవత్సరానికి ముందు వెలువడ్డ తెలుగు వచన కావ్యాల్లో ఆంగ్ల భాషా ప్రభావం కాన్పించదు. కాని 1890లో వీరేశలింగంగారి రచనలు వెలువడినప్పటి నుండి తెలుగురచనలపై ఆంగ్లభాషా ప్రభావం స్పష్టంగా కాన్పిస్తుంది. 1899 నాటికి వీరేశలింగంగారి రచనలన్నీ సంపుటాలుగా వెలువడినాయి. వారి ప్రభావంచేత సంస్కారవంతులైన అనేకరచయితలు వచన రచనలు చేసినారు. వీరి రచనల్లో శైలీ కాఠిన్యంలేదు. వీరేశలింగం గారితో ప్రారంభమైన ఆధునిక వచన వాఙ్మయం పలుశాఖల్లో విస్తరించింది. ప్రధాన శాఖలను పేర్కొంటాను.

నవల అనే ప్రక్రియ ఆంగ్ల భాషా ప్రభావంచేత తెలుగులో ఉద్భవించింది. వీరేశలింగంగారికి పూర్వమే, కొక్కొండ వెంకట రత్నం పంతులుగారు 1867లో మహాశ్వేతను, 1872లో నరహరి గోపాలకృష్ణయ్య సెట్టి రంగరాయ చరిత్రను ప్రచురించినారు. కాని, వీరు వాటిని నవలలుగా పేర్కొననేలేదు. వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్ అనే ఆంగ్ల నవల ఆధారంగా వీరేశలింగంగారు వ్రాసిన రాజశేఖర చరిత్ర అనేది ప్రథమ నవలగా ప్రఖ్యాతి నార్జించింది. ఆ కాలంలో చింతామణి పత్రికలో నవలలు వెలువడుతూ ఉండేవి. 1893లో ఖండవిల్లి రామచంద్రుడు వ్రాసిన ధర్మవతీ విలాసము, తల్లాప్రగడ సూర్యనారాయణరావు వ్రాసిన సంజీవరాయ చరిత్ర వీటిలో ముఖ్యమైనట్టివి. చింతామణి పత్రికా ముఖంగానే చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రామచంద్ర విజయమును ప్రచురించిరి. దీనికి చాల ప్రచారం కలిగింది. అహల్యాబాయి (1897) కర్పూర మంజరి (1898) అనేవి కూడా వీరి రచనలే.

ఈ కాలంలో కొన్ని చారిత్రక వచన గ్రంథాలు కూడ ప్రచురితమైనవి. బుక్క పట్టణం రాఘవాచార్యులు తెలుగు రాజుల చరిత్రను 1881లో రచించినారు. 1885లో

ఒడయరు వీరనాగయ్యగారు చాణక్య చరిత్ర వ్రాసినారు. వీరే బెండపూడి అన్నమంత్రి చరిత్ర (1881), తిమ్మరుసు చరిత్ర (1898) అనే వాటిని కూడ రచించినారు.

ఆంగ్ల భాషా ప్రభావంతో ఈకాలంలో తెలుగులో వ్యాసాలు, ఉపన్యాసాలు రచింపబడినాయి. 1881లో వెలువడిన వావిలాల వాసుదేవ శాస్త్రిగారి 'ఆంధ్రభాషను గూర్చిన ఉపన్యాసము' అనే దాన్ని ముందు పేర్కొనవలె. 1898లో గోపాలరావు నాయుడుగారు 'ఆంధ్రభాషా చరిత్ర సంగ్రహము' అనే వ్యాసాన్ని ప్రకటించినారు. 1885-1900 మధ్య కాలంలో 'చింతామణి'లో అనేక వ్యాసాలు ప్రచురితమైనాయి. తెలుగులో వాఙ్మయ విమర్శనం అనే ప్రక్రియ కూడ ఆంగ్లభాషా ప్రభావంచేత ఉద్భవించినట్టిదే. ఈ కాలంలో కొన్ని యిట్టి విమర్శలు వెలువడినాయి. చెన్న రాజధానీ కళాశాలలో దక్షిణామూర్తిగారు పింగళి సూరన్నను గూర్చి ఉపన్యసించి 1893లో దాన్ని ముద్రించినారు. 1896లో శ్రీ కొచ్చర్ల కోట రామచంద్ర వేంకట కృష్ణారావు బహద్దరువారు 'ఆంధ్ర భాషాభివృద్ధి' అనే వాఙ్మయము విషయిక వ్యాసాన్ని ప్రచురించినారు. కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రిగారి భాస్కరరామాయణ కర్తృత్వము (1898) వెన్నేటి రామచంద్రరావుగారి 'మనువసుచరిత్ర రచనా విమర్శనము', 'నన్నయభట్టారక చరిత్రము' అనేవి కూడ విమర్శనాత్మక గ్రంథాలే.

వీరేశలింగంగారు స్వయంగా తెలుగు వచన వికాసానికి బహువిధాల తోడ్పడ్డారు. వీరు సాహిత్యకులే కాక సంఘ సంస్కర్తలును కావడంచేత సులభ గ్రాంథికంలో ఉండే రచనలు అనేకం చేసి ఉన్నారు. వీరి గ్రంథాల్లో అధికాంశం వచన రచనలే కావడంచేత వీరికి గద్యతిక్కన అనే సార్థకనామం కలిగింది. వీరేశలింగం గారి నవలను గురించి చెప్పినానుకదా. సత్యరాజా పూర్వదేశయాత్రల వంటి కథా గ్రంథాలు, విక్టోరియా జీవిత చరిత్ర వంటి జీవిత చరిత్రలు. సత్ప్రవర్తన మొదలైన విషయాలపై వ్యాసాలు.. ఆంధ్ర కవులచరిత్ర వంటి సాహిత్య చరిత్ర, స్వీయ చరిత్ర మున్నగు గ్రంథాలు చూచి నప్పుడు వారి బహుముఖ ప్రజ్ఞ గోచరమవుతుంది.

ఆధునిక యుగం

ఆధునికయుగం నిజంగా వచన యుగం అని చెప్పవలసి ఉన్నది. వీరేశలింగం గారు ప్రారంభించిన బహుముఖ రచనము గిడుగు రామమూర్తి పంతులుగారి వ్యావహారిక భాషావాదం, అనే వాటిచే ప్రోత్సాహంచెంది వచన రచన వివిధ శాఖల్లో విస్తరించింది.

ఈరెండు విశేషాలేకాక మనదేశంలో గడిచిన 25 సంవత్సరాలలో పత్రికలు బహుజనామోదాన్ని పొందడం. అక్షరాస్యత దేశంలో అధికంకావడం, మాతృభాష బోధనకు ప్రాముఖ్యంరావడం, వంటివి ఈ విస్తరణకు మిగిలిన కారణాలుగా చెప్పవచ్చును.

ఆధునిక యుగానికి పూర్వం తెలుగు వచన ప్రయోజనం కేవలం కథాకావ్యాలకు మాత్రం పరిమితం అయి ఉండేది. కాని శ్రీవీరేశలింగంగారు దాన్ని చేపట్టడంతో, నవల, వ్యాసం, విమర్శనం, జీవిత చరిత్ర, సాహిత్య చరిత్ర కథానిక, శాస్త్ర రచన మొదలైన విభాగాలను వచనం ఆక్రమించింది. ఇక కవిత్వ రంగంలో కూడ వచనం తన ప్రయోజనాన్ని నిరూపించుకొంటుంది. అంటే ఈనాడు ఈరచనా పద్ధతికి ఎంతట విస్తృత ప్రచారం కలిగిందో నేరుగా చెప్పవలసిన అవసరం ఉండదు.

తెలుగుపై ఆంగ్ల భాషా ప్రభావంకలిగి దాని పరిణామంగా ఏర్పడిన రచనల్లో నవల ప్రథమంగా చెప్పదగింది. సమకాలిక విశేషాలను ఉల్లేఖించడంలో నేమి, చారిత్ర కాంశాలను రమ్యంగా చెప్పడంలో నేమి, ఈ యుగంలో నవల చాల శక్తి మంతమైన సాధనంగానే ఉన్నది. స్వాతంత్ర్యానికి పూర్వమే నవలా రచనలో పేరు పొందిన శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు, దాని తరువాత కూడ, నవలా రచనా వ్యాసంగాన్ని విడనాడలేదు. చారిత్రక విభాగంలో చూస్తే, వృత్తమకథా విధానాన్ని ప్రదర్శించి, మన పూర్వ సాహిత్యపు ఔన్నత్యాన్ని జ్ఞప్తికితెచ్చేవి శ్రీనోరి నరసింహ శాస్త్రిగారి నవలలు. విశ్వనాథ వారినవలల్లో చాలవరకు, నోరివారి నవలలన్నీ, సరళ గ్రాంథికంలో వ్రాయబడ్డ నవలలు. గ్రాంథిక భాషలోకూడ నవల చక్కగా వ్రాయవచ్చును అని వీరి రచలు నిరూపిస్తున్నాయి.

సాంఘికమైన వస్తువును గ్రహించి, సమకాలీన జీవితంపై దృష్టిని ప్రసరించిన వారిలో శ్రీ బుచ్చిబాబు చెప్పదగినవాడు. ప్రత్యేకశైలి మనస్తత్వ పరిశీలన శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి అభిమాన విషయాలు. వారిని అనుసరించే వారీనాడు చాలమంది ఉన్నారు. కాని బీనాదేవిని ఈ సందర్భంలో పేర్కొనవలె. ఇదే కాలంలో చాలమంది స్త్రీలు నవలా రచనావ్యాసంగాన్ని చేపట్టి సాధన చేస్తున్నారు. వీరు రచించిన నవలలు ప్రమాణం మాట ఎట్లా వున్నా, పరిమాణం మాత్రం అధికంగానే వున్నది. కౌసల్యాదేవి రంగనాయకమ్మ, సులోచనారాణి, ఆనందారామం మొదలైనవారు ఈ సందర్భంలో పేర్కొనదగి వున్నారు. ఏది ఎట్లావున్నా, వచనం తెలుగులో నవల ద్వారా విశేషంగా లోకంలో వ్యాప్తిచెందింది.

ఈ కోవలో పేర్కొన్న రచయితలందరూ వ్యావహారిక భాషనే తమ సాధనంగా ఎన్నుకొన్నారు. బుచ్చిబాబురచనల్లో ఇంగ్లీషు భాష చదువుకొన్న తెలుగువారు ఉపయోగించే భాష కాన్పిస్తుంది. రావి శాస్త్రి విశాఖ ప్రాంతంలోని మాండలికాన్ని గ్రంథస్థం చేయడంలో అందె వేసినచేయి. బీనాదేవి ఏ అవకాశమున్నా ఇంగ్లీషు వాక్యాలో, ఇంగ్లీషు పదాలో వ్రాయాలనే అభినివేశం ఉన్నవారుగా కనిపిస్తారు. వీరి నవలల్లో కొన్నింటికి ఆంగ్లంలోనే నామకరణంచేసి ఉన్నారు.

ఆంధ్రవచన రచనకు మరొక ప్రధానమైన ఆలంబనంగా ఉన్నది కథానిక రచన. ఆంగ్లభాషాసంపర్కంచేత తెలుగులో ఉద్భవించిన నూతన ప్రక్రియ యిది. యాంత్రికంగా పరిణమించిన యీనాటి సంఘంలో చాల శక్తి మంతంగాను ప్రచురంగాను ఉన్నది కథానిక . దీని కథా వస్తువుగా జీవితంలోని ఒక సంఘటనను గాని దానికి సంబంధించిన కొన్ని విశేషాలను గాని స్వీకరించడం సంభవిస్తుంది. ఒక్కొక్కసారి మానవ మనస్తత్వ సంబంధమైన ఏదో ఒకకోణాన్ని ప్రదర్శించడానికి కూడ కథానిక ఉపయోగపడుతూ ఉన్నది. అధిక ప్రచారాన్ని చెంది ఉండడంచేత, విభిన్న రచయితలు విభిన్న రచనాశిల్పాన్ని అవలంబించి కథానికారచన చేస్తున్నారు. దేశంలో ఉండే వార, మాస పత్రికలు కొండొకచో దినపత్రికలు కూడ, కథానికా ప్రచురణకు స్థానం ఇస్తున్నవి. ప్రేమ, ప్రణయం దారిద్ర్యం, ధనిక సమాజం,

రాజకీయాలు, రహస్య విషయాలు, ఒకటేమిటి అన్నీ కథానికలలో వస్తువులుగా మారుతూ ఉన్నవి. ఈనాడు తెలుగు దేశంలోని రచయితల్లో కథారచన చేస్తున్న వారే అధికంగా ఉన్నారు అంటే అనుచితంగా ఉండదు.

స్వాతంత్ర్యానికి పూర్వమే కథానికా రచన ప్రారంభించి ఇంకా కొనసాగిస్తున్న రచయిత కొడవటి గంటికుటుంబరావు. వీరు సంఖ్యలోను, ప్రమాణంలోను ఆధిక్యాన్ని పొందిన కథానికలను వ్రాసినారు. పాలగుమ్మి పద్మరాజుగారి 'గాలివాన' అనే కథతో, తెలుగుకథ అంతర్జాతీయ ఖ్యాతిని అందుకొన్నది. బుచ్చిబాబుగారి 'నిరంతరత్రయం', మంచికథల్లో పేర్కొనదగింది. ఇటీవల మధురాంతకం రాజారం, వాకాటి పాండురంగారావు కూడ మంచి కథలు వ్రాసివున్నారు. ఇస్మాయిల్ వ్రాసిన 'కాళీసీసాలు' అనే కథ శిల్పంలోను, వస్తువులోను ఎన్నిక చెందింది. భానుమతి అత్తగారి కథలు వ్రాసి కథానికకు వ్యంగ్యంతో కూడిన హాస్యాన్ని జోడించినారు. రంగనాయకమ్మ, సులోచనారాణి మొదలైన రచయిత్రులు కూడ కథానికా రచన చేపట్టి సమర్థతతో నిర్వహిస్తున్నారు. విశ్వనాథ శాస్త్రిగారి కథలు, నేటి కథానికా రచయితలకే ఆదర్శ వంతంగా ఉన్నవి. ప్రభావోపేతమైన మాండలిక భాష, పాత్రలలోని వాస్తవికత, వీరి కథల్లోని ప్రత్యేకతలు వీరు వ్రాసిన 'సారాకథలు' సంఘంలోని సారాన్ని ప్రదర్శిస్తూ ఉన్నవి. కొలకలూరి ఇనాక్, నవీన్ అనే రచయితలు కూడ మంచి కథలు వ్రాస్తున్నవారే. రచయితలు,రచనలు, అధికంగా ఉండం చేత, అన్నిటినీ గురించి ఈ రంగంలో చెప్పడం సాధ్యంకాదు.

ఈ రచయితలందరూ కథానికా రచనకు వ్యావహారిక భాషనే ఉపయోగిస్తున్నారు. వీరిలో చాలామంది సంభాషణోచితమైన భాష కథానికకు జీవం లాంటిదని గుర్తించినవారే. కొందరు రచయితలు వ్యావహారిక భాష పేరుతో, కృత్రిమంగాను, ఒక్కొక్క సారి వికృతంగాను ఉండే భాషను ఉపయోగించక పోలేదు. అయినా, దీనికి బలం వస్తువు కావడంచేత, పాఠకులు అంతగా పట్టించుకొన్నట్లు కాన్పించదు. ఏది ఎట్లా ఉన్నా, వ్యావహారిక భాష కథానికనూ, తదంతర్గత పాత్రలను పాఠకులకు సన్నిహితం చేయగలిగిందనడంలో సందేహంలేదు.

ఆధునిక కాలంలో వ్యాస రచనలో కూడ కొంత కృషి జరిగింది. వీరేశలింగం గారు వ్రాసిన వ్యాసాలే కాక, పానుగంటివారు వ్రాసిన సాక్షి వ్యాసాలు ఆరుసంపుటాలుగా వెలువడినాయి. ఇవి వివిధ వస్తు భరితమైనట్టివి. సామాజిక విశేషాలను నిశితంగా వ్యంగ్యంగా, ఒక్కొక్కసారి హాస్యభరితంగా విమర్శించేవి. ఇటువంటి వ్యాసాలు తిరిగి తెలుగులో ఇంకా వెలువడలేదనడంలో సందేహంలేదు. తరువాత కాలంలో వివిధశాస్త్రాలకు కళలకు చెందిన వ్యాసాలు వెలువడినాయి కాని, సాహిత్య విమర్శకు సంబంధించిన వ్యాసాలే ఈ కాలంలోఅధికం.రాజకీయమైన వ్యాసాలను వివిధ పత్రికలు ప్రకటిస్తూనే ఉన్నవి కాని, వాటికి శాశ్వత ప్రయోజనం తక్కువ. సాహిత్యపరమైన వ్యాసాల్లో రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారి సారస్వతాలోకం ముందు పేర్కొనదగింది. వివిధ రచయితల వ్యాససంకలనమైన మహాభారతోపన్యాసాలు అనే దాన్ని ఉత్తమ సారస్వత వ్యాస సంపుటిగా పేర్కొనవలె.

ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ మొదలైన సంస్థలు రచయితలను ప్రోత్సహించి వ్యాసాలను ప్రచురిస్తున్నాయి. సాహిత్యం మీద అభిమానం ఉన్నవారినే అధికంగా ఈ వ్యాసాలు ఆకర్షిస్తాయి. కాబట్టి, వీటికి పాఠకుల సంఖ్య తక్కువే అయినప్పటికీ, మంచివ్యాసాలే వచ్చినవని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఏవోకొన్ని సందర్భాలో తప్పిస్తే, పుస్తక రూపంలోను, పత్రికాముఖంగాను వచ్చే వ్యాసాలన్నీ గ్రాంథిక భాషా మయంగానే ఉన్నాయి. రాళ్లపల్లివారి వ్యాసాలు గ్రాంథికమే అయినా, చెప్పవలసిన అంశాలను క్లిష్టత లేకుండా తేటపరుస్తున్నాయి. ఇతర రచనలు కూడ ఆ విధంగానే ఉన్నవి. కొంత సాహిత్య వాసనకలిగి, అందులోని బాగోగులను పరిశీలించే వారికే ఈ వ్యాసాలు నిర్దేశింపబడడం చేత వీటి భాష గ్రాంథికంలో ఉంటూ ఉన్నది. విద్యార్థులు గ్రాంథిక భాషాధ్యయనం చేయడానికి ఈ వ్యాసాలు చక్కగా ఉపకరిస్తున్నాయి.

ఈ కాలంలో సాహిత్య విమర్శక గ్రంథాలు కూడ వెలువడినవి. ఆధునిక పద్ధతుల్లో మొదట సాహిత్య విమర్శకు పూనుకొన్నవారు కట్టమంచి రామలింగారెడ్డి గారు. వీరి కవిత్వతత్త్వ విచారము అనే గ్రంథం ఆధునిక సాహిత్య విమర్శకులకు

ఒజ్జబంతి అయింది. సర్వతోముఖ ప్రజ్ఞ కలిగిన విశ్వనాథ సత్యనారాయణగారి ప్రసన్నకథా కలితార్థయుక్తి కూడ ఇపుడే వెలువడింది. నన్నయగారి కథాశిల్ప రమ్యతను బహుముఖంగా ప్రదర్శించే గ్రంథమిది. వారిదే 'అల్లసానివారి అల్లిక జిగిబిగి' అనేది దీనిలో ప్రథమ ప్రబంధంలోని వన్నెచిన్నెలు విశేషంగా విస్తరింపబడినాయి. ఆధునిక సాహిత్యంపై కూడ మంచి విమర్శవెలువడింది. రమణారెడ్డి, ఆర్ ఎస్.సుదర్శనం, సుప్రసన్న మొదలైన వారీ రంగంలో కృషి చేస్తున్నారు. యువభారతి అనే సంస్థ ఇటీవల వెలువరించిన లహరీ పరంపర ఉత్తమ విమర్శక సాహిత్యంగా వున్నది. ఇది కాక, ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారు, శేషాచలం కంపెనీవారు, ప్రచురించిన విభిన్న ప్రాచీనకావ్యాలకు విజ్ఞులు విమర్శనతో కూడిన పీఠికలను వ్రాసినారు. ఈ పీఠికలు ఆంధ్ర విమర్శన సాహిత్యాన్ని సుసంపన్నం చేసినాయి. ఈ విమర్శనశాఖలోని భాష అధికాంశం గ్రాంథికంగా వుంటున్నది.

ఆధునిక యుగంలో చరిత్ర గ్రంథాలు కూడ వచ్చినవి. స్వాతంత్ర్యానంతర కాలంలో ఇవి మరికొంచెం అధికంగా వెలువడినవి. శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం, శ్రీ ఖండవల్లి బాలేందుశేఖరం గారలు కలిసి వ్రాసిన 'ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి అనే గ్రంథం. మన సాంస్కృతిక చరిత్రను చెప్పే ప్రథమ గ్రంథం. శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' కూడ ఈ కోవలో చేరినట్టిదే. ఇది రాజుల చరిత్రను కాక ప్రజాజీవిత విధానాలను వివరించేదిగా ఉన్నది. సాహిత్య చరిత్రల్లో ఖండవల్లివారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము' దివాకర్లవారి 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర' పేర్కొనదగినవిగా ఉన్నవి. చాగంటి శేషయ్యగారు వ్రాసిన 'ఆంధ్ర కవితరంగిణి' అనేక సాహిత్య చారిత్రక విశేషాలను వెల్లడించేదిగా ఉన్నది. ఇదే దిశలో శ్రీ ఆరుద్ర 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' ద్వారా మంచి కృషిచేసినవారనే చెప్పవలె. మధునాపంతుల సత్యనారాయణగారి 'ఆంధ్ర రచయితలు' అనే గ్రంథం పేర్కొనదగింది.

స్వాతంత్ర్యానంతరం ఆంధ్రదేశంలోని విశ్వవిద్యాలయాలు సాహిత్య పరిశోధనను తగినంతగా ప్రోత్సహించడంతో, కేవలం కొందరు పండితులకు మాత్రమే

పరిమితంగా వుండిన సాహిత్య పరిశోధన విస్తృతరంగంలో అడుగుపెట్టింది. ఆధునిక పద్ధతుల్లో, శాస్త్రబద్ధంగా వున్న పరిశోధన విశ్వవిద్యాలయాలలో కొనసాగింది. యువకులైన పరిశోధకులు అనేకులు సాహిత్యాన్ని మథించి, ఉత్తమ సిద్ధాంత వ్యాసాలు వ్రాసి ప్రకటించినారు.

సాహిత్య చరిత్రలు, పరిశోధన గ్రంథాలు, విషయవైశద్యం ప్రధానంగా కలిగినట్టివి. పరిమితమైన పాఠకులను కలిగినట్టివి. అందుచేత ఈ గ్రంథాలను వ్రాసిన రచయితలు, సరళగ్రాంథిక భాషనే తమ రచనలకు ఉపయోగించినారు. ఇందలి భాషయెట్లా వున్నా, వీటిప్రయోజనానికి ఏమీ లోపం కలుగలేదు. ఇంకా భవిష్యత్తులో వీటికి ప్రయోజనం అధికంగా ఉంటుంది.

ఈ రెండు మూడు దశాబ్దుల కాలంలో తెలుగు వచనంలో శాస్త్ర రచన కూడా తగినంత జరిగింది, ఇంతకు పూర్వమే విజ్ఞాన సర్వస్వం సంకలనం చేయడానికి ఒకటి రెండు ప్రయత్నాలు జరిగినవికాని అవి అంతగా ఫలవంతములు కాలేదు. స్వాతంత్ర్యానంతర కాలంలోఈరంగములో మంచి కృషిజరిగింది. ఉత్తమ గ్రంథాలు వెలువడినాయి. తెలుగు భాషా సమితివారు వివిధ సాంఘిక శాస్త్రాలపైననూ ప్రకృతి శాస్త్రాలపైననూ వ్యాసాలతో కూడిన సంపుటాలు విజ్ఞానసర్వస్వం అనే పేరుతో వెలువరించినారు. ఇవి విజ్ఞానానికి చెందిన వివిధ రంగాల్లో విషయ వైశద్యం కలిగి ఉన్నవి. ఆయా శాస్త్రాల్లో నిష్ణాతులైన రచయితలు, సంపాదకులు ఈ గ్రంథరచనలో పాల్గొన్నారు. ఇదే దిశలో మరో ప్రయత్నం జరిగి మరొక విజ్ఞాన సర్వస్వం "సంగ్రహ విజ్ఞాన కోశము' అనే పేరుతో వచ్చింది. ఎనిమిది సంపుటాలలో వివిధ విషయాన్వితమైన యీ "సంగ్రహ కోశము" సరళ గ్రాంథికంలో రచితమై ఉత్తమ శాస్త్ర గ్రంథ రచనకు ప్రతీకగా ఉన్నది. భాషా సమితి వారిగ్రంథం లోవలె విషయక్రమాన్ని బట్టి కాక, ఆకారాదిగా విషయ వివరణ దానిలో ఉన్నది. ఈ రెండు విజ్ఞాన సర్వస్వాలను దాదాపు ఒకేకాలంలో తెలుగు దేశానికి అందించిన సంస్థలు అభినందించదగినవి. వీటిలో తెలుగు భాషా సమితివారు ప్రచురించిన సంపుటాలలో శిష్టవ్యావహారిక

భాషనే ఉపయోగించినారు. వివిధ విషయాలను వ్యావహారికంలో సుగమంగా చెప్పడంలో వీరు కృత కృత్యులైనారనే చెప్ప వలసి ఉంటుంది.

తెలుగులో ఉన్నత పాఠశాల వరకు మాత్రమే ఇదివరకు విద్యాబోధన అనుమతింపబడడం చేత, ఆయా శాస్త్రాల్లో (ప్రకృతి, సాంఘిక) ఉన్నతదశలోని విజ్ఞానానికి చెందిన గ్రంథాలు అంతగా అవసరం అనిపించలేదు. కాని యిటీవల ప్రభుత్వం కళాశాల స్థాయిలోను తెలుగును బోధనా భాషగా ప్రవేశ పెట్టడంతో ఆ శాస్త్ర గ్రంథాల ఆవశ్యకత ఏర్పడింది. ఆ అవసరాన్ని తీర్చడానికి ప్రభుత్వం పూనుకొని, తెలుగు అకాడమీ అనే సంస్థ ద్వారా తెలుగులో శాస్త్ర గ్రంథాల ప్రచురణ చేయించింది. స్వల్పకాలంలోనే కళాశాల స్థాయికి ఉపకరించేవి, సాంఘిక, వాణిజ్య, ప్రకృతి శాస్త్రాల్లో అనేక ఉత్తమ గ్రంథాలు వచ్చినాయి. ఆయా విషయాల్లో నిపుణులైన విశ్వ విద్యాలయాది సంస్థల్లో బోధిస్తున్న విద్వాంసులు ఈ గ్రంథాలను రచించడం ఎంతో సముచితంగా ఉన్న: ఈ గ్రంథాల్లో వచన రచన శిష్ట వ్యావహారికంలో జరుగుతూ ఉన్నది. విద్యార్థులకు భాష సుగమం కావలెననికాబోలు, రచయితలూ, ప్రచురణ కర్తలూ, వ్యావహారిక శైలినే ప్రోత్సహిస్తూ ఉన్నారు. మరికొంత కాలంలోనే వివిధ విషయాలకు చెందిన అనేక మంచి గ్రంథాలను తెలుగు అకాడమీ రచింపచేసి, అనువాదం చేయించి ప్రచురిస్తుందని ఆశించవచ్చు.

ఈ కాలంలో తెలుగు వచన రచన ఎంతగా ప్రాచుర్యం పొందిందీ అంటే పైన పేర్కొన్న ప్రక్రియలేకాక, కవిత్వంకూడా వచనాన్ని ఆశ్రయించింది. ఆ విషయాన్ని ఇచట ప్రస్తావించి చర్చించడం నా పని కాదనుకొంటాను.

పరిశీలనలో ఉన్న కాలంలో వచన రచనకు అనుసరించిన భాషలో చాల పరివర్తనలు కలిగినవి. గిడుగు రామమూర్తి పంతులుగారు ప్రారంభించిన ఆ వ్యావహారిక భాషా ఉద్యమం అధిక ప్రచారాన్ని పొందింది. నవల, కథానిక వంటి సృజనాత్మక సాహిత్యాన్ని వ్యవహారిక శైలి పూర్తిగా ఆక్రమించింది. ఇప్పటికీ విశ్వనాథ వంటివారు కొందరు, కొన్ని నవలలను గ్రాంథికంలో వ్రాస్తూ ఉన్నా,కొన్ని సందర్భాలలో వారు కూడ ఆ నియమాన్ని సడలించుకొన్నారు. ఇక ఇతర రచయితలు వ్యావహారిక

భాషనే అనుసరిస్తున్నారు. సాహిత్య పరిశోధనలు, విమర్శనలు చేసేవారు ఇంకా సరళ గ్రాంథికాన్నే ఉపయోగిస్తున్నారు. ఇటీవల వచ్చిన శాస్త్ర గ్రంథాలు వ్యావహారిక భాషలో ఉన్నాయని చెప్పినాను కదా.

వచన రచన వ్యావహారిక శైలిలో జరగడంలోని కొన్ని సాధక బాధకాలను ఇచ్చట చర్చించడం అనుచితం కాదనుకొంటాను. భాషలోని లోతుపాతులు తెలిసి, పండితులైన వ్యుత్పన్నులు వ్యావహారిక భాషలో రచనలు చేసినా దానిలో ఉండే గాంభీర్యానికి, అర్థ పుష్టికి నిఘాతం కలుగదు. కాని, విపరీతమేమంటే భాష వ్యావహారికమేకదా అని అవ్యుత్పన్నులు ఈనాడు రచనా వ్యాసాంగానికి పూనుకొంటున్నారు. భాష, భావానికి వాహకం కావడం చేత వీరిరచనల్లో భాషకూ, తద్వారా భావానికి విఘాతం కలుగుతూ ఉన్నది. మనకు రాజకీయ స్వాతంత్ర్యం రావడంతో స్వేచ్ఛను పొందినామని సంతోషిస్తున్నాం. కాని, ఈ స్వాతంత్ర్యానంతర కాలంలో భాషాపరంగా మరింత పారతంత్ర్యానికి గురి అయినాము. ఈనాడు వెలువడే నవలల్లో, కథల్లో ఎంత ఎక్కువ ఇంగ్లీషు భాష కలిపి వ్రాస్తే అంత గొప్ప అనుకొని వ్రాస్తున్నారు నేటి రచయితలు, రచయిత్రులు. ఇప్పుడు వెలువడుతున్న ఏ వార పత్రికను తిరగ వేసినా ఈ విషయం కొట్టవచ్చినట్లుగా కనిపిస్తుంది. ఎన్నో నవలల పేర్లు కథానికల పేర్లు ఇంగ్లీషులోనే వుంటున్నాయంటే, భాషాపరంగా మనం ఎంత పారతంత్ర్యానికి వశమైనామో తెలియవస్తుంది. ఈ పరిణామం, ఏ భాషకూ ఆరోగ్యప్రదం కాదు. మన రచయిత(త్రు)లకు ఇంగ్లీషు మీద అభినివేశం వుంటే, ఇంగ్లీషు రచనలు చదవడం, అదే భాషలో వ్రాయడం చేయవచ్చు. కాని భాషా సాంకర్యం మంచికి దారి తీయదనడం యదార్థం. హిందీ, తమిళం వంటి యితర దేశ భాషల్లో ఈ వింత పరిణామం లేనేలేదు. మన రచయిత(త్రు)లు ఎంత త్వరగా ఈ అలవాటును వదిలితే అంత మంచిది. ఇది వ్యావహారికభాషలోని హేతువాద దృష్టిని అర్థం చేసుకోక పోవడం చేత, వచ్చిన వికృత పరిణామ మనడంలో సందేహం లేదు.

ఇక ఉన్నత విద్యకు విధించిన పాఠ్యగ్రంథాలు వ్యావహారిక భాషలో వుండడంలోని మంచి చెడులను గురించి చెప్పవలె. సరళమైన భాష అధ్యయనం చేస్తున్న విషయాన్ని సుగమం చేస్తుందనడంలో విప్రతిపత్తి లేదు. కాని యిది విధిగా వ్యావహారికంలోనే వుండాలనే నియమం లేదు. గ్రాంథికమై నిరలంకారమైన తెలుగులోనే సరళ భాషను రూపొందించవచ్చు. ఈ భాష సర్వసామాన్యంగా వుండి అందరికీ ఆమోదయోగ్యం అవుతుంది. అట్లుకాక వ్యావహారికంలో కొన్ని మాండలిక శబ్దాలు కొన్నిరూపాలు చేరడం తప్పదు. అవి ఇతర మండలాల వారికి అర్థగ్రహణంలోను ఉచ్చారణలోను సులభంగా వుండవు. ఒక ప్రాంతపు మాండలిక పదాలను, వేరొక మండలంవారు విధిగా అభ్యసించడం సంభవిస్తున్నది. పైగా ఈ వ్యావహారిక భాషాభ్యాసం వల్ల విద్యార్థికి రచనలో ప్రామాణికమైన స్థూల దృష్టి ఏర్పడడం లేదు. అందుచేత, ఇతర సోదర దేశీయ భాషల్లో వలె మనంకూడా పాఠ్యగ్రంథ రచనలో సరళ గ్రాంథిక శైలినే అనుసరిస్తే, విద్యార్థులకు, రచయితలకు మేలు చేకూర్చిన వారమవుతాము.

★ ★ ★

Blank Page

Blank Page

ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

- తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారు చేయడం.
- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషాసంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
- తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించ డానికి చర్యలు చేపట్టడం.

  తెలుగును పాలన, బోధన, ప్రసార మధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
- తెలుగు వారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం
- తెలుగు జాతి చరిత్రపై భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారు చేయడం.
- తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు నేలపై గల చారిత్రిక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

తెలుగు భాష వికాసం **తెలుగు సంస్కృతి ప్రకాశం**

దేశ భాషలందు తెలుగు లెస్స